RNI No: TGTEL/25/A2649
VOICE OF PRAJALU
# వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD
హైదరాబాద్ | మంగళవారం, ఏప్రిల్ 28, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 21 | పేజీలు: 8 | వెల : రూ.1



## సెగలు కక్కుతున్న నార్త్ తెలంగాణ

# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజార్ ప్రమాణం



హైదరాబాద్ ఏప్రిల్ 27, ( వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరై నూతన ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. అంతకుముందు, ఆదివారం నాడు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు వీరి నియామకానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

**మైనార్టీల సంక్షేమమే నా లక్ష్యం: ఎమ్మెల్సీ అజారుద్దీన్**

ప్రమాణస్వీకారం అనంతరం మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రిమండలికి, టీపీసీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధి కోసం తాను మరింత నిబద్ధతతో కృషి చేస్తానన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, మైనార్టీల సంక్షేమంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి వల్లే తనకు ఈ అవకాశం లభించిందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలను అధిగమిస్తూ ప్రజాసేవలో ముందుంటానని ఈ సందర్భంగా అజారుద్దీన్ స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కోదండరాం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో తాను భాగమై, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన

(మిగతా 2వ పేజీలో)



# విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు

### తెలుగు వైభవానికి ఏయూ కృషి: సీఎం చంద్రబాబు

విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ... యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే మీ ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు మరో చరిత్ర అని అన్నారు. ఆర్థిక సంస్కరణలు వచ్చాక 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 57 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు. 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం... అది ఏయూ ప్రత్యేకత. 3 యూనివర్సిటీలో రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది. జైపూర్ రాజ్ విక్రమ దేవ్, గజపతి రాజవంశం, పిఠాపురం రాజవంశం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా చేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నానని అన్నారు. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ... దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గారి తండ్రి సర్వేపల్లి అభిమాని. ఈయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పడమే కాదు... తెలుగు వైభవానికి

(మిగతా 2వ పేజీలో)

# పౌరుషం లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్, బీజేపీ ఎంపిలు



### కేసీఆర్ మండిపాటు

హైదరాబాద్ : తేజస్వి సూర్య సందర్భంలో తెలంగాణ పైన అడ్డగోలుగా, అవమానకరంగా మాట్లాడితే తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? తెలంగాణ పౌరుషం లేదా వాళ్ళకు? బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విరుచుకుపడ్డారు. సోమవారం నాడు జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో అయన మాట్లాడారు. ఆదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా క్షమాపణ చెప్పించేటోళ్ళము. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషం లేకుండా వ్యవహరించారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలబెట్టాం. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాలలో నెంబర్ వన్, కూలగొట్టడంలో నెంబర్ వన్ గా నిలబెట్టే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుంది. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు.



# ఓ వైపు నో స్టాక్ బోర్డులు, మరోవైపు కిలోమీటర్ల మేర క్యూ

**విజయవాడ, ఏప్రిల్ 27, (వాయిస్‌టుడే )**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత సామాన్యులను బెంబేలెత్తిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అనేక పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టాక్ అందుబాటులో ఉన్న కొన్ని బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆదివారం నాటికే రాష్ట్రంలో 420కి పైగా పెట్రోల్ బంకులు మూతపడగా.. సోమవారం ఆ సంఖ్య మరింత పెరిగేలా కనిపిస్తోంది. సాధారణం కంటే సరఫరా పెంచినా అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ కొట్టించడంతో కొరత ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర రాజధాని ప్రాంతమైన విజయవాడలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బంకు నిర్వాహకులు నిల్వలను పొదుపుగా వాడుతూ, వాహనదారులకు పరిమితంగానే పెట్రోల్‌ను పోస్తున్నారు. దీనివల్ల దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సిటీలోని ఆటోనగర్, మొగల్రాజపురం, బెంజిసర్కిల్ వంటి ప్రధాన కూడళ్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. ఒక్కో వాహనదారుడు తమ అవసరానికి సరిపడా ఇంధనం కోసం మూడు నాలుగు బంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ వాహనదారులకు పెట్రోల్, డీజిల్ కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా రైతులు పెద్ద క్యాన్లతో వచ్చి డీజిల్ కావాలని అడుగుతున్నారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం వంటి ప్రాంతాల్లో బంకులు మూతపడటంతో వాహనదారులు దిక్కుతోచని స్థితిలో వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం డీజిల్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో, లారీలు, ట్రాక్టర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూడాల్సి వస్తోంది. కొందరు ముందుజాగ్రత్తగా డబ్బాలతో వచ్చి ఇంధనాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతుందన్న భయంతో ఇంధన వినియోగం భారీగా పెరిగింది. దాంతో బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోనూ ఇదే తరహా కష్టాలు కొనసాగుతున్నాయి. చాలా చోట్ల స్టాక్ లేక బంకులు మూతపడగా, చీరాలలో కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే ఇంధనం అందుబాటులో ఉంది. దీంతో అక్కడ వాహనదారుల రద్దీ నియంత్రించడం అసాధ్యంగా మారుతోంది. ఇంధన కొరత

(మిగతా 2వ పేజీలో)

# రికార్డ్ స్థాయిలో తెలంగాణ ఎక్సైజ్ ఆదాయం రూ 44,557 కోట్లు



హైదరాబాద్ : తెలంగాణ ఎక్సైజ్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో మొత్తం రూ. 44,557 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో మద్యం అమ్మకాల ద్వారా రూ. 40,209 కోట్లు, లైసెన్స్ ఫీజులు, బార్ల ద్వారా మిగిలిన ఆదాయం సమకూరింది. రాష్ట్ర చరిత్రలో ఈ స్థాయి ఆదాయం రావడం ఇదే మొదటిసారి. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 7% వృద్ధిని సూచిస్తోంది.

**2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయం ముఖ్యాంశాలు**

మొత్తం ఆదాయం: 44,557 కోట్లు (మద్యం అమ్మకాలు ం లైసెన్స్ ఫీజులు). మద్యం అమ్మకాల ఆదాయం: 40,209 కోట్లు (382.91 లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు). వ్యాపారం: 2024-25లో 37,487 కోట్లుగా ఉన్న ఆదాయం, 2025-26లో 7 శాతం పెరిగింది. దుకాణాల దరఖాస్తులు/ఫీజులు: వైన్స్ మరియు బార్ల లైసెన్స్ ఫీజుల ద్వారా సుమారు ?5,189 కోట్ల వరకు అదనపు ఆదాయం వచ్చింది.

**డిసెంబర్ అమ్మకాలు**

డిసెంబర్ నెలలోనే రికార్డు స్థాయిలో ?5,051 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ?20,859 కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయం, కేవలం ఏడు సంవత్సరాల్లో రెట్టింపునకు పైగా పెరిగి రూ. 40 వేల కోట్ల మార్కును దాటడం విశేషం.



# ప్రతి కుటుంబం ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి

**జనగణన తో పథకాల ప్రయోజనాలు సరిగ్గా అందుతాయి**

**జనగణ కార్యక్రమం లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్ : జనగణనలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో ఉప ముఖ్య ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సోమవారం

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

మంగళవారం, ఏప్రిల్ 28, 2026

# కేసీఆర్ ఫీల్డ్ ప్లాన్



**హైదరాబాద్, ఏప్రిల్ 27, ( వాయిస్ టుడే )**

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఇక స్పీడ్ పెంచాల్సిందే. ఇటు అధికార కాంగ్రెస్‌ను..ఇటు కవిత పార్టీని టార్గెట్ చేస్తూ దూకుడు పెంచాల్సిందేనని డిసైడ్ అయిందట గులాబీ పార్టీ. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని గులాబీ బాస్ డిసైడ్ చేశారట. కేసీఆర్ కీలక నిర్ణయాలు ప్రకటించబోతున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ పేరును టీఆర్ఎస్‌గా మార్చాలన్న డిమాండ్ నేపథ్యంలో ఊహించని మార్పులు ఉండొచ్చని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక పోరుబాటే అంటోంది బీఆర్ఎస్. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తుండటంతో..ఇంక స్పీడును పెంచేందుకు సమూల మార్పులకు సిద్ధమవుతోంది. పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్న ఈ మీటింగ్ చాలా కీలకమైందిగా చెబుతున్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిగ్ డెసిషన్స్ తీసుకోబోతున్నారన్న టాక్ నడుస్తోంది.పార్టీ పేరు టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణంపై అధినేత కేసీఆర్ పూర్తిగా దృష్టి పెట్టలేదు. చాలా కాలంగా పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగలేదు. 2022లో ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా మార్చిన కేసీఆర్ వెంటనే అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు ఎలక్షన్స్ బిజీలో ఉండిపోయారు. దీంతో కమిటీల నియామకం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా రెండేళ్ల టైమ్ మాత్రమే ఉండటంతో..పార్టీ బలోపేతంపై కేసీఆర్ సీరియస్ ఫోకస్ చేసినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పార్టీకి జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర స్థాయిలో కొంత మంది ప్రధాన కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. దీంతో కొత్త కమిటీల నియామకం తప్పనిసరని భావిస్తున్నారట. రెండు మూడు నెలల్లో కచ్చితంగా కమిటీలన్నీ నియమించాలన్న ప్లానింగ్‌లో ఉన్నారట. సభ్యత్వ నమోదు తర్వాత పూర్తిస్థాయిలో కమిటీల ఏర్పాటుపై ఫోకస్ చేస్తారట.ఇక పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత వరుసగా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవడంతో..నెగెటివ్ సెంటిమెంట్‌గా ఫీల్ అవుతున్నారట. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన తర్వాతే పార్టీ అధికారం కోల్పోయిందని, నేతల చుట్టూ కేసులు విచారణలు అంటూ కష్టాలు మొదలయ్యాయనే చర్చ పార్టీలో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ పేరును మళ్లీ బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌గా మార్చాలన్న డిమాండ్ పెరుగుతూ వస్తోంది. దీంతో పార్టీ పేరు మార్పుపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ కీలక సమావేశంలో పార్టీ పేరు మార్పుపై కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందంటున్నారు.ఇక కవిత పార్టీ ఏర్పాటు..టీఆర్ఎస్ పేరు..ఈ అంశాలపై కేసీఆర్ రియాక్ట్ అవుతారా లేదా అన్నది కూడా ఇంట్రెస్టింగ్‌గా మారింది. కవిత నేరుగా కేసీఆర్‌నే టార్గెట్ చేయడంతో..క్యాడర్, లీడర్లలో కాన్ఫిడెన్స్ నింపేందుకు గులాబీ బాస్ స్పందిస్తారా? ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది చూడాలి.

# సర్కార్ కంట్రోల్‌లోకి మెట్రో...



**హైదరాబాద్, ఏప్రిల్ 27, (వాయిస్‌టుడే)**

హైదరాబాద్ మెట్రో రైల్ పై తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. ఎల్ అండ్ టీ 100శాతం ఈక్విటీ వాటాలను స్వాధీనం చేసుకుంది. ఈ నెల 30 నాటికి 15వేల కోట్ల డీల్ పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో మెట్రో ఇక సర్కార్ పరిధిలోకి వచ్చింది. నగరవాసులు ప్రధాన రవాణ వ్యవస్థ అయిన హైదరాబాద్ మెట్రోపై ఇక పూర్తి అధికారాలు సర్కార్ కే చెందనున్నాయి. మెట్రో నిర్వహణ, యాజమాన్య బదిలీ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మెట్రో భవిష్యత్ ప్రణాళికలు, విస్తరణ, నిర్వహణ బాధ్యతలను ఈ కొత్త బోర్డు పర్యవేక్షించనుంది. ఇందుకోసం జీవో నెంబర్ 128 విడుదల చేసింది.హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ నూతన చైర్మన్ గా సీఎస్ రామకృష్ణరావును ప్రభుత్వం నియమించింది. సర్ఫరాజ్ అహ్మద్ ను ఎండీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్లుగా జయేశ్ రంజన్, వికాస్ రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, డీజీపీ శివధర్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్, అశోక్ రెడ్డి, జితేశ్ వి పాటిల్ ను నియమించింది. మేనేజింగ్ డైరెక్టర్ గా శివేంద్ర ప్రతాప్ ను నియమించింది. మెట్రోను మరింత లాభసాటిగా మార్చడం, రెండో దశ విస్తరణ పనులను వేగవంతం చేయడంపై కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు దృష్టి సారించనున్నారు. మెట్రో నిర్వహణలో ఎల్ అండ్ టీ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, రాయితీలకు సంబంధించిన వివాదాలకు ఈ నిర్ణయంతో తెరపడనుంది.ఈక్విటీ బదిలీ ద్వారా మెట్రోపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఎల్ అండ్ టీకి సంబంధించిన 15వేల కోట్ల రూపాయల వాటాను కొనుగోలు చేసేందుకు సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐఎఫ్ఆర్ సీ నుంచి 13వేల 615 కోట్ల రూపాయలను ప్రభుత్వం రుణంగా తీసుకోనుంది. ఈ మొత్తాన్ని 20 ఏళ్ల కాల పరిమితిలో తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పని చేస్తున్న పలువురు ఉద్యోగులను ఏడాది పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ట్రో పగ్గాలను చేతుల్లోకి తీసుకున్నందున, పాలనా పరమైన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ మెట్రో బోర్డును కొత్తగా పునర్వ్యవస్థీకరిస్తూ కీలక అధికారులను నియమించింది. మెట్రో బోర్డు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును ప్రభుత్వం నియమించింది. ఇన్నాళ్లూ ప్రైవేట్ యాజమాన్యం పర్యవేక్షణలో ఉన్న బోర్డు, ఇప్పుడు సీనియర్ ఐఏఎస్ అధికారుల కనుసన్నల్లో పనిచేయనుంది. బోర్డు డైరెక్టర్లుగా రాష్ట్రానికి చెందిన అత్యున్నత స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఐటీ , పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, వికాస్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిలను బోర్డు సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారిని బోర్డులోకి తీసుకోవడం ద్వారా మెట్రో భద్రత , శాంతిభద్రతల పరంగా కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల మెట్రో చార్జీల నియంత్రణ, రాయితీలు, భవిష్యత్తు పొడిగింపు పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని భావిస్తున్న తరుణంలో, ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగి ప్రాజెక్టును హస్తగతం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామంతో గ్రేటర్ హైదరాబాద్ వాసులకు మరింత మెరుగైన రవాణా సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



## అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో చెలరేగిన మంటలు!

**అంబర్‌పేటలోని 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం**

**మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది**

**పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం**

హైదరాబాద్ : హైదరాబాద్ అంబర్‌పేటలోని 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా నల్లటి దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మరిన్ని ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. సర్వీస్ సెంటర్ పక్కనే నివాస సముదాయాలు ఉండటంతో, మంటలు వ్యాపిస్తాయేమోనన్న భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీప ఇళ్లలోని వారిని అధికారులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రమాదంలో సర్వీస్ సెంటర్‌లోని పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలు (షార్ట్ సర్క్యూట్ లేదా ఇతరత్రా) ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## సెగలు కక్కుతున్న నార్త్ తెలంగాణ

అదిలాబాద్, ఏప్రిల్ 27, ( వాయిస్ టుడే ) : ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల జాబితాలో ఇప్పటికే ఆదిలాబాద్ ఉండగా.. తాజాగా తెలంగాణ నుంచి రామగుండం, కొత్తపేట, మంచిర్యాల పట్టణాలు కూడా ఈ జాబితాలో చేరాయి. ప్రాణ ఎయిర్ ఏక్యూఐ పోర్టల్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. రామగుండం ప్రపంచవ్యాప్తంగా 59వ స్థానంలో నిలిచింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ నుంచి 44.4 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఉత్తర తెలంగాణలో భౌగోళిక పరిస్థితులు, పొడి గాలుల ప్రభావం వల్లే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.తెలంగాణలోని భానుడు భగ్గుమంటున్నాడు. ఎంతలా అంటే.. ఉష్ణోగ్రతలు ప్రపంచ రికార్డులను తాకుతున్నాయి. అంతర్జాతీయంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న టాప్-100 నగరాల జాబితాలో ఇప్పటికే ఆదిలాబాద్ ఉండగా.. తాజాగా మరో మూడు తెలంగాణ పట్టణాలు ఈ జాబితాలోకి చేరాయి. రామగుండం, మంచిర్యాల, కొత్తపేట ప్రాంతాల్లో భానుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడని ప్రాణ ఎయిర్ ఏక్యూఐ పోర్టల్ వెల్లడించింది. ఉష్ణోగ్రతల ఆధారంగా నిరంతరం మారుతూ ఉండే ఈ జాబితాలో.. శనివారం నాటి గణాంకాల ప్రకారం రామగుండం 59వ స్థానంలో నిలిచి గ్లోబల్ హాట్‌స్పాట్‌గా మారింది.జాబితాలోని ఇతర వివరాలను పరిశీలిస్తే.. మంచిర్యాల 64వ స్థానంలో, కొత్తపేట 76వ స్థానంలో, ఆదిలాబాద్ 91వ స్థానంలో నిలిచాయి. ఈ నాలుగు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ నుంచి 44.4 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయి. జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్‌లోని బండా, మహారాష్ట్రలోని అకోలా, భుసావల్, జల్గావ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్ నగరాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలోని చాలా నగరాలు ఈ జాబితాలో ఉండటం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్రమైన వడగాల్పుల పరిస్థితిని ప్రతిబింబిస్తోంది.వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఈ స్థాయి ఎండలు నమోదు కావడం భౌగోళికంగా ఆశ్చర్యకరం ఏమీ కాదని అంటున్నారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి సరిహద్దుగా ఉండే ఆదిలాబాద్, మంచిర్యాల వంటి జిల్లాలు సహజంగానే వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాలని అంటున్నారు. భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త ధర్మరాజు వివరణ ప్రకారం.. ఈ ప్రాంతం 'హీట్ కోర్ జోన్' పరిధిలోకి వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావం వల్ల భూ ఉపరితల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.కాగా, రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోతోంది. ముఖ్యంగా బొగ్గు గనులు, పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా ఉండే రామగుండం, మంచిర్యాల వంటి చోట్ల వేడి తీవ్రత మరింత అధికంగా ఉంది. ప్రభుత్వం, వాతావరణ శాఖ ఇప్పటికే ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకూడదని సూచించింది. భౌగోళిక కారణాలకు తోడు పొడి గాలుల ప్రభావం తోడవ్వడంతో రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఏప్రిల్ 29 వరకు రాష్ట్రంలో వేడి గాలులు వీస్తాయని చెప్పారు. ఆ తర్వాత పలు జిల్లాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు.



## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజార్ ప్రమాణం

సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. గవర్నర్ కోటా కింద పెండింగ్‌లో ఉన్న 2 ఎమ్మెల్సీ పదవుల నియామక ఫైల్‌పై గవర్నర్ శివ్‌ప్రతాప్ సంతకం చేయడంతో మంత్రి అజారుద్దీన్ పదవీ గండం నుంచి గట్టెక్కారు. గత ఏడాది ఆగస్టు 30న ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన అప్పటి నుండి రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామం మంత్రి అజారుద్దీన్‌కు అత్యంత కీలకంగా మారింది. శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యత్వం లేకుండానే ఆయనను రాష్ట్ర ప్రభుత్వం మంత్రిగా ప్రమాణం చేయించింది. నిబంధనల ప్రకారం 6 నెలల గడువులోగా ఏదైనా సభలో సభ్యుడిగా ఎన్నికవ్వాల్సి ఉండగా, ఆ గడువు ముగిసే సరిగ్గా కొన్ని రోజుల ముందు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులకు ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ నిర్ణయంతో అటు ప్రభుత్వం, ఇటు అజారుద్దీన్ కు ఊరట లభించింది. దీంతో ఆయన మంత్రి పదవికి ఎదురైన సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయి.

## విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు

ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య రంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో అభినందిస్తున్నారు. ఎంతోమంది నాయకులను తయారు చేసిన గడ్డ ఏయూ. రాజకీయ ఉద్దండులు ఇక్కడ నుంచి వచ్చారు. వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడి నుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. నాక్ ఏ ప్లస్ ప్లస్ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్ లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్ లో 5వ ర్యాంక్ లో ఉంది. యూనివర్సిటీలు నేషనల్ స్ట్రాటజిక్ అసెట్స్... వాటిని కాపాడుకోవాలి. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు... ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. రూ.64 కోట్ల విలువైన ప్రాజెక్టులను నేడు మనం ప్రారంభించుకున్నాం. ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్ వర్స్ల్ ల్యాబ్ నెట్వర్క్ సెంటర్ ప్రారంభించుకున్నాం. రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకున్నాం. బాలురు, బాలికల హాస్టల్, కాన్వకేషన్ హాలు, వీసీ భవన్ కు శంకుస్థాపన చేసుకున్నాం. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఓయూలు చేసుకున్నాం. నాకు 76 ఏళ్లయినా.. నేను 26 ఏళ్ల వ్యక్తిగానే ఆలోచిస్తాను. ఒకప్పుడు ఐటీతో ప్రారంభించాం... హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకీ దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చామని అన్నారు.

## ప్రతి కుటుంబం ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి

ఉదయం ఖమ్మంలో ప్రజాభవన్ క్యాంప్ కార్యాలయంలో స్వీయ జనగణన కార్యక్రమంలో వెబ్ సైట్ ద్వారా ఆయన తన వివరాలను నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 ప్రక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

## ఓ వైపు నో స్టాక్ బోర్డులు, మరోవైపు కిలోమీటర్ల మేర క్యూ

కారణంగా ఉపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్న అధికారులు, ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుండి ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, సోమవారం కల్లా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అసలు ఈ కొరత ఎందుకు ఏర్పడిందని ఆయన ప్రశ్నించగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద వాణిజ్య వినియోగదారులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరపడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వివరించారు. దీనికి తోడు నయారా, రిలయన్స్, జియో వంటి ప్రైవేట్ ఆపరేటర్లు సరఫరా నిలిపివేయడం సమస్యను మరింత తీవ్రతరం చేసిందని కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.రాష్ట్రంలో ఇంధన వినియోగం ఒక్కసారిగా పెరిగిన తీరును గణాంకాలతో సహా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సాధారణంగా రోజుకు 6,330 కేఎల్ పెట్రోల్ అమ్ముడవుతుండగా, శనివారం అది ఏకంగా 34 శాతం పెరిగి 8,489 కేఎల్‌కు చేరింది. ఆదివారం కూడా సాధారణం కంటే 22 శాతం అదనంగా వినియోగం జరిగింది. డీజిల్ విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోందని, శనివారం 16 శాతం అదనపు డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. అగ్రికల్చర్ మరియు ఆక్వాకల్చర్ అవసరాలు పెరగడం కూడా దీనికి ఒక కారణమని అధికారులు పేర్కొన్నారు.ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రాకుండా చూడాలని, అవసరమైతే రైతులకు కూపన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి బంక్ వద్ద రెవెన్యూ, పోలీస్ బందోబస్తుతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడా ఇంధనం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు వెంటనే రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ మరియు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం నాటికి రాష్ట్రంలో ఎక్కడా 'నో స్టాక్' బోర్డులు కనిపించకూడదని అధికారులను ఆదేశించినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.

# పాత్రికేయుల సమస్యలను మీరైనా పరిష్కరించండి

**- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**- కొత్త కమీషనర్ కు పాత సమస్యల పత్రం**



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): హైదరాబాద్ జర్నలిస్టుల సమస్యలు చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్నాయని, సమస్యలను మీరైనా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ నూతన స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డిని కోరారు. స్పెషల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని సోమవారం ఆయన పలవురు ఫెడరేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపి జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పత్రాన్ని అందజేశారు.బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి కేటాయింపులు లేవని, జర్నలిస్టుల సంక్షేమం, చిన్న, మధ్యతరహా పత్రికలు, పిరియాడికల్స్ పట్ల గత రెండేళ్లుగా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, సరైన అడ్వర్టయిజ్మెంట్స్ లేవని, ప్రభుత్వం ఇచ్చిన అడ్వర్టయిజ్మెంట్స్ కి బిల్స్ ఇవ్వడం లేదని, ఫలితంగా ప్రచురణకర్తలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడ్డారని మామిడి సోమయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించిన బిల్లులు గత రెండు సంవత్సరాలుగా ఇవ్వకపోగా, పైగా గత కొన్ని నెలలుగా పిరియాడికల్స్ కు ప్రభుత్వం ఇచ్చే ప్రకటలు పూర్తిగా నిలిపివేశారని, ఒకవైపు ప్రభుత్వ ప్రకటనలు సరిగా లేక మరోవైపు పెండింగ్ బిల్లులు రాక అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ గత రెండేండ్లుగా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన కమీషనర్ ముందు ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో అనేక చిన్న, మధ్యతరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా చాలా ఏళ్లుగా పెండింగ్ లో పెట్టారు. దీని వల్ల చాలామంది పత్రికల నిర్వాహకులైన జర్నలిస్టులు ఆర్థిక భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ ఎన్ ఐ,పీఆర్ జీఐ అనుమతితో నడుస్తున్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు లేవు. కనీసం అక్రెడిటేషన్ కార్డులైనా ఇవ్వడం లేదు.కావున వెంటనే ఈ సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలో చిన్న మధ్య తరహా పత్రికలను ఆదుకోవాలని కోరుతున్నాం. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో నిధులు కేటాయించాలి.

కేబుల్ ఛానల్ లకు అక్రెడిటేషన్లు జారీ చేసే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. కేబుల్ ఛానల్ లకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే విధంగా జీవో 252 ను సవరించాలి. ఇకపోతే జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేదు. అనేక రాష్ట్రాల్లో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇస్తుండగా మన రాష్ట్రంలో ఏ ఒక్క సీనియర్ జర్నలిస్టుకి పెన్షన్ ఇవ్వడంల్లదని అన్నారు. రెండేళ్ళుగా జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని, పాత కార్డులకు ప్రతీ రెండు నెలలకోసారి స్టిక్కర్ వేస్తూ పొడిగిస్తున్నారని, కొత్త అక్రెడిటేషన్ కార్డుల జారీకి జీవో 252 విడుదలై మూడు నెలలైనా ఇంత వరకు కార్డులు ఇవ్వలేదని, పాత కార్డుల గడువు ఇంకో రెండు రోజులే ఉండగా కొత్త కార్డులు ఇంకా ఇవ్వకపోవడం ఆందోళనకరమని మామిడి సోమయ్య పేర్కొన్నారు. అదే విధంగా జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అవి కూడా ఇంత వరకు లేవు. కావున సమస్యలను తమరు సానుకూలంగా పరిశీలించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామని అన్నారు. కమీషనర్ ను కలిసిన వారిలో మామిడి సోమయ్యతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవికుమార్, కో-కన్వీనర్ ఆర్.శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు గోవింద్, రవి కుమార్, బ్రహ్మం తదితరులు

**పరిష్కరించాల్సిన సమస్యలు**

1.రాష్ట్ర బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలి.
2.చిన్న, మధ్య తరహా పత్రికలకు, పీరియాడికల్స్ కు రావాల్సిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలి.
3.రెగ్యులారిటీ ఉన్న చిన్న,మధ్య తరహా దినపత్రికలు, పీరియాడికల్స్ ను ఎంపానల్మెంట్ చేయాలి.
4.చిన్న పత్రికలకు పెద్ద పత్రికలతో సమానంగా ప్రభుత్వ ప్రకటనలు రెగ్యులర్ గా విడుదల చేయాలి.
5.రెగ్యులారిటీ ఉన్న చిన్న, మధ్యతరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలి.
6.ఆర్ ఎన్ ఐ,పీఆర్ జీఐ
రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న ఎంపానల్మెంట్ లేని పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి.
7.కేబుల్ టీవీ ఛానల్ లకు పాత పద్ధతిలోనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి. జీవో 252 ను సవరించాలి.
8.అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.
9.సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి.
10.పదవీ విరమణ పొందిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలి.
11.జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి.
12.ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి.



## అనారోగ్యంతో చికిత్స చేయించుకుంటున్న బాధితుడికి ఎల్ఓసి అందజేత

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ వారి నివాసంలో రోడ్డమేస్త్రిరి నగర్ డివిజన్ పరిధిలో గల శ్రీరామ్ నగర్ కి చెందిన షేక్ నజీర్ మియా అనారోగ్యం కారణం చేత నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా వారి ఆర్థిక పరిస్థితి గమనించి మాజీ శాసనసభ్యులు ప్రభుత్వం ద్వారా (2,50,000) రెండు లక్షల యాభై వేల రూపాయల విలువ గల ఎల్ఓసి కాపీని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ అదే విధంగా నియోజకవర్గంలోని ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చీర్యాలలో హిందూ సమ్మేళనం

నాగారం, ఏప్రిల్ 27:-(వాయిస్ టుడే): చీర్యాలలో హిందూ సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మహిళా శక్తి హిందూ జాగృతి అంశాలపై ప్రధాన వక్తలు ప్రబోధించారు. విద్యార్థినులు చేసిన కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రతి కాలనీ నుంచి హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేశారు.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు జన్మదిన సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (పేట్ బషీరాబాద్) పరిధిలోని మీనాక్షి ఎస్టేట్స్‌లో, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి మూగ జయశ్రీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు జన్మదిన సందర్భంగా జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. మల్లారెడ్డి , ఝాన్సీ, నల్లనాగుల కృష్ణా, పోల గంగాధర్, ప్రవీణ్ గౌడ్, రాజేష్, ప్రహ్లాద్, రవీందర్ రెడ్డి, చైతన్య మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



## సుచిత్ర సర్కిల్‌లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే ): ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంపత్ మాధవ రెడ్డి హాజరై, పార్టీ శక్తి, భవిష్యత్ కార్యాచరణపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. అలాగే సీనియర్ నాయకులు కిషన్ రావు కుంట సిద్దిరాములు సుధాకర్ గౌడ్ జ్ఞానేశ్వర్ ఎల్లా గౌడ్ బాలమల్లేష్ రామచంద్ర రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మధుకృష్ణ మరియు మహిళా నాయకురాళ్లు అరుణారెడ్డి పద్మ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు..

## ఎంబీబీఎస్ పట్టా అందుకున్న బీర్ల అయిలయ్య కూతురు బీర్ల అరుంధతి






నార్కెట్ పల్లి: ప్రముఖ విద్యాసంస్థ అయిన కామినేని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారి సతీమణి బీర్ల అనిత ప్రథమ పుత్రిక బీర్ల అరుంధతి ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఘనంగా పట్టాభిషేక వేడుక గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ వేడుకలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అతిథులు పాల్గొని విద్యార్థుల కృషిని అభినందించారు.బీర్ల అరుంధతి తన విద్యాభ్యాసంలో చూపిన పట్టుదల, కృషి, అంకితభావం ద్వారా ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు. ఆమెకు పట్టా ప్రదానం చేసిన సందర్భంగా వేదికపై గౌరవ అతిథుల చేతుల మీదుగా సర్టిఫికేట్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అరుంధతిని అభినందించారు. వైద్య విద్య పూర్తి చేయడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఒక మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ ఘన విజయంతో బీర్ల అరుంధతి తల్లీ తండ్రులు బీర్ల అయిలయ్య అనిత కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు గర్వకారణంగా నిలిచారు.



## బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్‌లో జరుగుతున్న అవకతవకపైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ ముసుగులో దందాలు చేస్తున్నారని ఆరోపణలు కండిస్తున్నాము**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎఆర్.సాదుయాదవ్**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎఆర్. సాదు యాదవ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్రికలలో వస్తున్న వార్తలను గమనిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ పేరుతో దందాలు జరుగుతున్నాయన్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అమలులోకి వచ్చిందని, నిజంగా పేదలకే ఇళ్లు అందాయా అనే విషయంలో సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎక్కువగా ఇళ్లు కేటాయించారని ఆరోపిస్తూ, ఈ అంశంపై ఒక కమిటీ ఏర్పాటు చేసి నిజానిజాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ముసుగులో దందాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు నిరాధారమని తీవ్రంగా ఖండించారు.తమ ప్రభుత్వం చేయలేని పనులను తాము అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తామని, ప్రస్తుతం బిఆర్కే ఫౌండేషన్ తరపున ఉచిత వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం వంటి సేవలను అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని తెలిపారు. గతంలో ఒక సొసైటీ ఏర్పాటు చేసి అవకతవకలు జరిగాయని రద్దు చేసి, మళ్లీ కొత్త సొసైటీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ సొసైటీలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారే తప్ప, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా తప్పు చేసినా, వారిని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.నిజంగా లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించారా లేదా అన్నది పూర్తిగా విచారణ చేసి, ఒకవేళ అర్హతలేని వారికి ఇళ్లు ఇచ్చినట్లయితే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో 8వ బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చారి, ఫెడరేషన్ డైరెక్టర్, 6వ బ్లాక్ నాయకుడు ఎస్.కె. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే ): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక... మన గులాబీ జెండా..! అలుపెరుగని పోరాటంతో రాష్ట్రాన్ని తెచ్చిన జెండా.. అభివృద్ధిలో తెలంగాణను అగ్రగామిగా నిలిపిన జెండా..! ఎత్తిన జెండాను దించకుండా పట్టుదల, నిబద్ధతతో ప్రయాణం చేసి ఎన్నో కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొని గమ్యాన్ని ముద్దాడిన ఉద్యమ వీరుడు మన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ . దశాబ్దాల స్వరాష్ట్ర పోరాటలను గమ్యానికి చేర్చిన తెలంగాణ ఆస్తిత్వం బీఆర్ఎస్ పార్టీ అని తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అందరికీ భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ ప్రెసిడెంట్లు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, మహిళా నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజల గుండెల్లో రగిలిన జ్వాల నుంచి పుట్టిన పార్టీ బిఆర్ఎస్

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 27(వాయిస్ టుడే): చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని బిఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగడుగునా అవమానాలకు గురైన తెలంగాణ ప్రజల గుండెల్లో రగిలిన జ్వాల నుంచి పుట్టిన పార్టీ బిఆర్ఎస్. ఎక్కడ నీ తెలంగాణ అని ప్రశ్నించిన వారికి తన సంకల్ప దీక్షతో చావు నోట్లో తలపెట్టి ఢిల్లీకి తెలంగాణ సెగ తగిలేలా కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత దీక్షా దక్షుడు పెద్దలు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నటికైనా బీఆర్ఎస్ పార్టీయే కొండంత అండ. రానున్న రోజుల్లో తిరిగి తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, వనం శ్రీనివాస్, నార్ల కంటి బాలయ్య, సుదర్శన్, రమణా రెడ్డి, మధుకర్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
మంగళవారం 28 ఏప్రిల్ 2026



## కీసరగుట్టలో స్వామి వారి పల్లకిసేవ

నాగారం, ఏప్రిల్ 27:-(వాయిస్ టుడే) : కీసరగుట్టలోని శ్రీ భవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి పల్లకి సేవ, ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర సిఐ ఆంజనేయులు, ఎస్ఐ హరిప్రసాద్ లు పాల్గొని స్వామి వారి పల్లకి మోసారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి, అమ్మవారి ని దర్శించుకున్నారు.



## ఘనంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

### వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు జన్మదినాన్ని లాలాపేటలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుని జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళా పారిశుద్ధ కార్మికులకు బిజెపి సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేపట్టారు. ఈ మేరకు సోమవారం లాలాపేట లోని వెంకటేష్ గౌడ్ నివాసం వద్ద చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండారు విజయలక్ష్మి హాజరై 200 మందికి పైగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ప్రకాష్, నాయకులు బండేపల్లి ప్రవీణ్ కుమార్, కరుణాకర్, ఉపేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ నివారించండి

### మోడీ ప్రభుత్వ కుట్రలను ఎండగట్టండి

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతతో బంకుల్లో నో స్టాక్ బోర్డులు కన్పడుతున్నాయనీ, దీంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచి, చమురు సంస్థల ద్వారా అన్ని బంకులకు ఆయిల్ సరఫరాను పునరుద్ధరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం లాభాపేక్షతోనే ఈ ఆయిల్ కంపెనీలు ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి సామాన్యుడిని దోచుకునేందుకు పన్నిన కుట్రలో భాగమనీ అన్నారు. ఒకవైపు దేశంలో ఇందన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతూనే, మరోవైపు కృత్రిమ కొరతను సృష్టించడం కేంద్ర బీజేపీ ప్రభుత్వ దుశ్చర్యకు నిదర్శనం. యుద్ధం నేపథ్యంలో అయిల్ సంక్షోభాన్ని నివారించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచకుండా నిలిపివేసిందనీ, ఎన్నికలు ముగిసిన వెంటనే సామాన్యుడిపై ధరల భారం మోపేందుకు రంగం సిద్ధం చేసిందనీ అన్నారు. రష్యా నుంచి అతి తక్కువ ధరకు ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నా, ఆ లాభాన్ని ప్రజలకు పంచకుండా కేవలం కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నది. పెట్రోల్ బంక్ డీలర్లు ముందస్తుగా వందల కోట్ల రూపాయలు డిపాజిట్లు చెల్లించినప్పటికీ, చమురు సంస్థలు ఆయిల్ టాంక్లర్లను పంపడం లేదు. డీజిల్ దొరకక రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంధనం దొరకక లారీలు, వాహనాలు నిలిచిపోయే ప్రమాదం వున్నది. దీంతో నిత్యావసరాల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. తక్షణమే ప్రజలు ఇబ్బందులు పడకుండా చమురు నిల్వలలను తక్షణమే విడుదల చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని, అన్ని పెట్రోల్ బంకులకు పూర్తిస్థాయిలో ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు.

## ఓయూలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం



సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సోమవారం ఉదయం విద్యార్థి ఆత్మహత్యాయత్నం కు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు మండలం, గోవిందపురం గ్రామానికి చెందిన వినీష్ (19), ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో మైనింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి, తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం సుమారు 9 గంటల సమయంలో లేడీస్ హాస్టల్ ముందు వినీష్ ఈ ఘటనకు పాల్పడ్డాడు. సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, తీవ్ర గాయాలతో ఉన్న వినీష్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో వినీష్‌కు చికిత్స కొనసాగుతోంది. అతడి శరీరం 70 శాతానికి పైగా కాలిపోయిందని, ముఖ్యంగా ముఖ భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. వినీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గాంధీ సూపరింటెండెంట్ డా. వాణి పర్యవేక్షణలో వైద్యసేవలు అందుతున్నాయి. ప్రాథమిక దర్యాప్తులో ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో కూడా వినీష్ పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 29న ఖైరతాబాద్‌లో ఘనంగా 'హోమియో ఫెస్ట్'

### హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ

### ఆధ్వర్యంలో... డా. శామ్యూల్ హానిమన్ 271వ జయంతి వేడుకలు



హైదరాబాద్, ఏప్రిల్ 27 :( వాయిస్ టూ డే): హోమియోపతి వైద్య పితామహుడు డా. శామ్యూల్ హానిమన్ 271వ జయంతిని పురస్కరించుకుని, హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్.ఎం.ఎ.టి) ఆధ్వర్యంలో 'హోమియో ఫెస్ట్' ఈ నెల 29న ఖైరతాబాద్‌లోని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్.వి. సుబ్రహ్మణ్యం, తెలంగాణ ప్రభుత్వ పవర్ ఙ ఎనర్జీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

హోమియో ఫెస్ట్‌లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి హోమియోపతిక్ గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, ప్రాక్టీషనర్ల కోసం సైంటిఫిక్ సెషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, స్లోగన్, మెమ్, రీల్స్, క్విజ్, లైవ్ స్కిట్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువ వైద్యులల్లో సృజనాత్మకత, క్లినికల్ నైపుణ్యాలు, వైద్య విజ్ఞానం పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రఖ్యాత హోమియో వైద్యుడు డా. ఎన్. రామయ్య స్మారక ఉపన్యాసం నిర్వహించబడనుండగా, కర్ణాటకకు చెందిన సీనియర్ వెటర్నరీ డాక్టర్ డా. పి.కె. నిజలింగప్ప 'వెటర్నరీ హోమియో వైద్యం'పై ప్రసంగించనున్నారు. ఇదే సందర్భంలో కిమ్స్ హాస్పిటల్ విద్యా విభాగం సహకారంతో హెచ్.ఎం.ఎ.టి ఆధ్వర్యంలో నిర్వహించే 'క్లినికల్ అబ్జర్వర్షిప్ కోర్స్'ను కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డా. బి. భాస్కర్ రావు ఆవిష్కరించి ప్రారంభించనున్నారు.

ఐసిఆర్‌హెచ్ క్లినికల్ డైరెక్టర్ డా. వేణుగోపాల్ గౌరి, కిమ్స్ స్కిల్ టైరో విభాగానికి చెందిన సయ్యద్, కృష్ణ స్వరూప్‌లు కోర్స్ వివరాలు వెల్లడించారు. హోమియో ఫెస్ట్ ముగింపు వేడుకకు భారత ప్రభుత్వ మాజీ కేంద్ర మంత్రి డా. సముద్రాల వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలోని అన్ని హోమియో వైద్య కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్‌ను సత్కరించనున్నట్లు ఉపాధ్యక్షుడు డా. మధు వారణాసి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిమ్స్ హోమియోపతి వైద్య కళాశాల స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. కార్యక్రమంలో డా. రామయ్య స్మారక ఉపన్యాసం స్పాన్సర్ డా. రఘురాం, మెంబర్ డా. కల్పనకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం దిశగా మరో అడుగు

### కోదండరాంకు శుభాకాంక్షలు తెలిపిన మోతే శోభన్ రెడ్డి, శ్రీలత



సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కోటా కింద ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం ని శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) నియమించడం పట్ల రాష్ట్ర రాజకీయ వర్గాల్లో విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కోదండరాం నియామకం ఉద్యమకారులకు గౌరవప్రదమైన గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు మోతే శోభన్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు తెలంగాణ శాసనమండలిలో కోదండరాం ని మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, శాసనసభ్యులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు కోదండరాం నియామకాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పిస్తూ వారి త్యాగాలను గుర్తిస్తున్నదని అన్నారు. ఉద్యమంలో పాలుపంచుకున్న వారికి సముచిత స్థానం కల్పించడం ద్వారా ప్రభుత్వం విలువల ఆధారిత పాలనకు కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్తులో నూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు, అవకాశాలు కల్పిస్తూ వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కోదండరాం నియామకం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా, ఈ పరిణామం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడమే కాకుండా, ప్రజా సంక్షేమానికి దారితీసే సానుకూల నిర్ణయంగా విశ్లేషిస్తున్నారు.



## టిజిఎస్‌ఆర్టీసి ఎండిని ఘనంగా సన్మానించిన జెఎసి నేతలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్టీసీజెఎసి తలపెట్టిన సమ్మె విజయవంతం అయినందున జేఏసీ ప్రధాన డిమాండ్లు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం ప్రకటన అధికారికంగా ప్రకటించినందున, కార్మిక సంఘాలతో చర్చలు జరిగినప్పుడు ఎండి సానుకూలంగా స్పందించారని కృతజ్ఞతగా టిజీఆర్టీసీ విసి ఙ ఎండి వై.నాగిరెడ్డి ని జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు సోమవారం టిజిఎస్ ఆర్టీసి జెఎసి ఆధ్వర్యంలో జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి లు ఆర్టీసీ ఎండి ని కలిసారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి లు మాట్లాడుతూ..గుర్తింపు సంఘ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్, యావత్ ఆర్టీసి ఉద్యోగులకు 11 శాతం ఫిట్మెంట్ తో వేతన సవరణ 01-04-2021 నుండి అమలు కు ప్రభుత్వం తగు ఆదేశాలు యాజమాన్యానికి జారీ చేయడం సంతోషకరమని అన్నారు. మిగతా 29 డిమాండ్లను యాజమాన్యంతో పరిష్కారం చేసుకోమని ప్రభుత్వం ఆదేశించినందున యాజమాన్యం వెంటనే ఆ డిమాండ్ల పరిష్కారానికి తగిన చర్యలు ప్రారంభించాలని కోరారు. గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించడానికి యాజమాన్యం, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరగా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారులైన ఈడి (ఈ) వెంకన్న, ఎఫ్.ఏ ని, సిపిఎంని, జాయింట్ డైరెక్టర్ ని శాలువా, పూలగుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## మే 10 న పటాన్చెరులో 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు

### ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు : మే 10వ తేదీన పటాన్చెరు పీవీ నరసింహారావు ఆడిటోరియం కేంద్రంగా ఏర్పాటు చేసిన 10వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలను విజయవంతం చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం పటాన్చెరులోని తన నివాసంలో కరాటే పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడ పోటీలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ కు మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు రాజు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# నా కొడుకుని కాపాడండి అంటూ దళిత మహిళ ఆవేదన

### సంతోష్ యాదవ్ తన కొడుకుని కిడ్నప్ చేశాడని ఆరోపణ

### పోలీసులు న్యాయం చేయాలంటూ దళిత సంఘాల నాయకుల డిమాండ్



సికింద్రాబాద్, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి): తన కూతురిని ప్రేమించాడనే కోపంతో సంతోష్ యాదవ్ అనే వ్యక్తి తన కొడుకులను అన్యాయంగా కేసులలో ఇరికించి, చిత్ర హింసలు పెట్టి తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని మీనా కుమారి అనే దళిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు పలువురు దళిత నాయకులు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల తల్లి మీనా కుమారి మాట్లాడుతూ...తన పెద్ద కొడుకు ప్రేమిస్తే వాడిని కిడ్నప్ చేసి కొట్టి కేసులో ఇరికించారని, ఇప్పుడు మళ్లీ ఆదివారం రాత్రి తన చిన్న కొడుకు రాజీవ్ ని కిడ్నప్ చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దళిత సామాజిక వర్గానికి చెందిన వారమనే కారణంగానే తమను చిత్ర హింసలకు గురిచేస్తున్నారని వాపోయింది. పోలీసులు కూడా తమకు న్యాయం చేయడం లేదని, తన కుమారుడి ఆచూకీ తెలపాలని కోరుతుంది. తల్లి తెలిపిన వివరాల ప్రకారం...

తన పెద్ద కుమారుడు అర్జున్ (23) ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడనే కోపంతో కక్ష్య పెంచుకొని అమ్మాయి తండ్రి సంతోష్ యాదవ్ గతంలో తన కొడుకుపై పోక్సో కేసు నమోదు చేయించారని చెప్పారు. మళ్లీ అమ్మాయి తన కొడుకుతో మాట్లాడుతుందని కోపం పెంచుకొని ఈ నెల 17వ తేదీన కిడ్నప్ కు గురి అయ్యాడని, అదే రోజు మియాపూర్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన పెద్దగా పట్టించుకోలేదన్నారు. మరుసటి రోజు లొకేషన్ యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ వద్ద లొకేషన్ చూపిస్తుందని చెప్పి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. 19వ తేదీ న జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారనీ, తన కొడుకును విపరీతంగా కొట్టి పోలీసులకు అప్పగించారన్నారు. తన కొడుకుని కొట్టి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించినట్లు సంతోష్ యాదవ్ తెలిపాడని, విషయం తెలుసుకొని స్టేషన్ కు వెళ్తే గాయాలతో కొడుకు కనిపించాడని చెప్పింది. తన చిన్న కొడుకు రాజీవ్ ని అలాగే కిడ్నప్ చేశారని కన్నీరు పెట్టుకుంది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. అనంతరం దళిత నాయకులు డాక్టర్ మురహరి బుద్దారం, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు దప్పు నర్సింగ్ రావు, కాసర్ల మధు మాట్లాడుతూ...తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడాలని, కానీచట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కిడ్నప్ చేయడం ఏంటని ప్రశ్నించారు. డబ్బు అహంకారంతో పోలీసులను తప్పుడు త్రోవ పట్టించి అప్పుడు పెద్ద కొడుకుని, ఇప్పుడు చిన్న కొడుకుని ఎత్తుకెళ్లడం ఏంటని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బ తింటున్నాయని పేర్కొన్నారు. మైనర్ బాలికలకు మాత్రమే కాదని బాలురకు కూడా దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పోలీసులు ఇప్పుడైనా బాధిత కుటుంబ సభ్యులకు సహకారం అందించి, కిడ్నపర్ లను పట్టుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# "శ్రీ సాయినాథ్ గార్డెన్స్" పేరుతో గల రెసిడెన్షియల్ లేఅవుట్‌లో ప్లాట్లుగా వేసి నకిలీ పత్రాలు సృష్టించి నివాస స్థలాలుగా విక్రయం

**( పటాన్ చెరు, వాయిస్ టుడే)**

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండల రెవెన్యూ పరిధిలోని రుద్రారం గ్రామంలో "శ్రీ సాయినాథ్ గార్డెన్స్" పేరుతో గల రెసిడెన్షియల్ లేఅవుట్‌లో ప్లాట్లుగా వేసి నివాస స్థలాలుగా విక్రయించిన భూములను పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ, వ్యవసాయ భూమిగా తప్పుడు/నకిలీ పత్రాలు సృష్టించడం, డబుల్ రిజిస్ట్రేషన్, రద్దు చేయవలసిందిగా వినతి -- గూర్చి.

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, రుద్రారం గ్రామంలోని జీ పీ ఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ "శ్రీ సాయినాథ్ గార్డెన్స్" పేరుతో 218 ఎకరాల 22 గుంటల విస్తీర్ణంలో 3100 కి పైగా ప్లాట్లతో రెసిడెన్షియల్ లేఅవుట్ వేయడం జరిగింది. ఇదే జీ పీ ఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం GPR చిట్స్ & ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బషీర్‌బాగ్‌లో కార్యాలయాలు నిర్వహిస్తూ, చిట్స్, ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించారు. కస్టమర్ల నుండి భారీ మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించి, వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారాలలో పెట్టుబడి పెట్టారు. 2004లో వారి చిట్స్ ఉ ఫైనాన్స్ సంస్థ నష్టాల్లోకి వెళ్లడంతో డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించలేకపోయారు. దీంతో, డిపాజిటర్లకు నగదు చెల్లింపుల బదులుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఉన్న తమ వెంచర్లలో ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో "శ్రీ సాయినాథ్ గార్డెన్స్" వెంచర్‌లో ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే, అసలు ధర కంటే రెండింతలు వసూలు చేసి, డిపాజిటర్లకు మాత్రమే కాకుండా ఇతరులకు కూడా ప్లాట్లు విక్రయించారు.

GPR హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జి. పున్నారావు, వేసిన "శ్రీ సాయినాథ్ గార్డెన్స్" లేఅవుట్‌కు 24-04-2000న గ్రామపంచాయతీ అనుమతి లభించింది. అయితే, 2002 నుంచి లే ఔట్ విషయంలో కుట్ర పూర్వకంగా వ్యవహరించింది. ఈ లే ఔట్ లో 70 కి పైగా సర్వే నంబర్లు ఉండగా 10 నుంచి 15 సర్వే నంబర్లను మాత్రమే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో చూపిస్తూ, కుట్రపూరితంగా మిగిలిన సర్వే నంబర్ల వివరాలను దాచిపెట్టి రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ వ్యవహారంతో మొదటి నుంచి కొనుగోలుదారులను మోసం చేసే విధంగా యాజమాన్యం ప్రవర్తిస్తుందని అర్థమవుతుంది. ఇదిలా ఉండగా 2002 లో విక్రయించిన భూములను ఇదే సంస్థ లో డైరెక్టర్‌గా ఉన్న వెంకట రావు కుమారుడి కంపెనీ అయిన ఈ సీ ఐ కార్పొరేషన్ సంస్థకు 2005 లో అప్పటి కార్పొరేషన్ బ్యాంక్ కు తాకట్టు పెట్టి కొలెట్రల్ గ్యారంటీ ఇచ్చి రూ. 190 కోట్లకు పైగా ఋణాన్ని పొందడం జరిగింది. ప్లాట్ యజమానులకు తెలియకుండా ఫోర్జరీ పత్రాలతో బ్యాంకులో నుండి పొందడమే కాకుండా తీసుకున్న లోను చెల్లించక పోవడంతో కార్పొరేషన్ బ్యాంకు ను విలీనం చేసుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ తరువాత చట్టం ప్రకారం బ్యాంకు వేలం ప్రక్రియ ప్రారంభించింది. ఈ తరుణంలో ఈ



భూములను కొల్లగొట్టడమే లక్ష్యంగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఒక రియల్ ముఠా బ్యాంకు అప్పును సెటిల్ చేస్తామని ప్లాట్ యజమానులను మభ్యపెడుతూ రంగంలోకి దిగింది.

ఆ తర్వాత లోక్ అదాలత్ ద్వారా బ్యాంకు తో సగం అమౌంట్ కు ( 115.66 కోట్లు) సెటిల్ చేసుకుని ఆ అప్పులు రూ.100 కోట్లను ఈ సీఐ ఇంజనీరింగ్ అండ్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చెల్లించగా మిగిలిన రూ.15.66 కోట్లను మాత్రమే చెల్లించి విలువైన భూములను కాజేసేందుకు కుట్ర చేశారు. 2024 నుంచి పెండింగ్ మ్యుటేషన్ ద్వారా ధరణి లో దరఖాస్తు చేసుకుని కాంగ్రెస్ పార్టీ పెద్దల ఒత్తిడితో తహసీల్దార్ కార్యాలయం ద్వారా అక్రమంగా పట్టాదార్ పాస్‌బుక్స్ పొందారు. తదుపరి, 16-01-2026న డాక్యుమెంట్ నం.60/2026 ద్వారా మళ్లీ వ్యవసాయ భూమిగా చూపుతూ డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. ఇది డీ ఆర్ టీ అటాచ్మెంట్ ఆర్డర్ (22-08-2025) కు విరుద్ధంగా చెప్పవచ్చు.

2000 సంవత్సరం వెంచర్ వేయగా 2015లో అప్పటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా పలువురు జీపీఆర్ సాయి నాథ్ గార్డెన్స్ కు చెందిన పలువురు ప్లాట్ ఓనర్లు ఎల్ ఆర్ ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోగా 2020 సంవత్సరంలో మరింత మంది ఎల్ ఆర్ ఎస్ కు దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా అప్పటి రుద్రారం పంచాయతీ అధికారుల నుంచి జీ పీ ఆర్ సాయి నాథ్ గార్డెన్ కు చెందిన అనధికార లే ఔట్ వివరాలతో పాటు దరఖాస్తు చేసుకున్న వివరాలను సైతం మీకు అందించారు. కానీ మళ్ళీ లే ఔట్ అయిన భూములను తిరిగి ధరణిలో పెండింగ్ మ్యుటేషన్ కింద దరఖాస్తు చేసుకోగా క్షేత్ర స్థాయిలో కనీస పరిశీలన లేకుండా, సబ్ రిజిస్ట్రార్ ఈ సీ (ఎంక్యుబేరెన్స్ సర్టిఫికెట్) చూడకుండానే పటాన్ చెరు తహశీల్దార్లు మ్యుటేషన్ కు జిల్లా కలెక్టర్కు ప్రపోజల్ పంపారు. అప్పటి కలెక్టర్ సైతం ఎలాంటి పర్యవేక్షణ లేకుండానే మ్యుటేషన్ కి లైన్ క్లియర్ చేశారు.

దీంతో 54 ఎకరాల లే ఔట్ భూములను గత జనవరి 16 వ తేదీన డాక్యుమెంట్ నంబర్ 60/2026 తో ఎల్ ఎస్ ఎం ఎల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరుపై వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై ప్లాట్ బాధితులు గతంలోనే ప్రజావానిలో తమరికి ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకొనబడలేదు.

దానికి తోడు 25-01-2026న LSML ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు యంత్రాలతో వచ్చి, కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్‌ను ఉల్లంఘిస్తూ ప్లాట్లపై అక్రమంగా ప్రవేశించి గోడలు మరియు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ వ్యవహారంపై పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో FIR నంబర్లు 470/2026, 471/2026, 475/2026, 476/2026 నమోదు చేయబడ్డాయి. కానీ అక్కడ సైతం బాధితులకు ఎలాంటి న్యాయం జరగలేదు. రెక్కల ముక్కలు చేసుకుని జీవితాంతం కష్టపడి రూపాయి రూపాయి కూడా పెట్టి ప్లాట్లు కొనుక్కున్న 3100 మంది ప్లాట్ ఓనర్లకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ ఫిర్యాదును మరొకసారి బీఆర్ఎస్ పార్టీ తరఫున మీ దృష్టికి తీసుకుని వస్తున్నాం. మొదటి చర్యగా అక్రమంగా జారీ చేసిన పట్టాదార్ పాస్‌బుక్స్ ను రద్దు చేయడంతోపాటు డబుల్ రిజిస్ట్రేషన్ (Doc No.60/2026) రద్దు చేయాలి. ప్లాట్ యజమానులను మోసం చేస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు డాక్యుమెంట్ ఫోర్జరీ డబల్ రిజిస్ట్రేషన్ కు పాల్పడ్డ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని వారికి సహకరించిన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినమ్ర పూర్వకంగా మనవి చేస్తున్నాం.

## సివిల్ ఇంజనీరింగ్‌లో ఆకుల విశాల్‌కు పీహెచ్.డీ



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి ఆకుల విశాల్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సుస్థిర పదార్థంగా అల్ప కార్బన్ కాంక్రీటుపై ప్రయోగాత్మక పరిశోధనలు' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అఖిలేష్ చేపూరి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని పర్యావరణ సుస్థిరతతో సమతుల్యం చేయాల్సిన అత్యవసర అవసరాన్ని ఈ అధ్యయనం తెలియజేస్తుందన్నారు. డాక్టర్ విశాల్ పరిశోధన, కొబ్బరి చిప్ప ఆధారిత తేలికపాటి కాంక్రీట్, బాసిల్లస్ సబ్టిలిస్ ఉపయోగించి బ్యాక్టీరియాతో స్వయంగా మరమ్మతు చేసుకునే కాంక్రీటు వంటి వినూత్న పద్ధతుల ద్వారా తక్కువ కార్బన్ ఉద్గారాలు గల, మన్నికైన కాంక్రీటును అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టిందని తెలిపారు. ఈ పరిశోధన ఫలితాలు మెరుగైన బలం, మన్నిక, పగుళ్లను తట్టుకునే సామర్థ్యం, అలాగే పర్యావరణ ప్రభావం తగ్గడం వంటి అంశాలను ప్రదర్శిస్తున్నా యన్నారు. కాంక్రీట్ నిర్మాణాల దీర్ఘాయువు, సుస్థిరతను పెంపొందించడానికి పర్యావరణ అనుకూల పదార్థాలు, జీవ ఆధారిత పద్ధతుల సామర్థ్యాన్ని ఈ అధ్యయనం హైలైట్ చేస్తోందని వివరించారు. డాక్టర్ విశాల్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రమేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## HPS పరిశ్రమలో కార్మికులకు నూతన వేతన ఒప్పందం

పటాన్ చెరు: హమ్మండ్ పవర్ సొల్యూషన్స్ పరిశ్రమ కార్మికులకు అనుకూలంగా నూతన వేతన ఒప్పందం కుదిరింది. హమ్మండ్ పవర్ సొల్యూషన్స్ ఎంప్లాయిస్ యూనియన్ (న్యూజుఖ) అధ్యక్షుడు గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో, యాజమాన్యం మరియు లేబర్ కమిషనర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ నూతన వేతన ఒప్పందం ద్వారా కార్మికుల వేతనాలు, భత్యాలు మరియు పని పరిస్థితుల్లో మెరుగుదలలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రతతో పాటు సంక్షేమ సౌకర్యాలను కూడా పెంచనున్నట్లు యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారంలో ఇది ముఖ్యమైన అడుగు అని అన్నారు. లేబర్ కమిషనర్ ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్చలు కొనసాగాలని సూచించారు. ఈ వేతన ఒప్పందం ద్వారా కార్మికులకు లాభం చేకూరడంతో పాటు సంస్థ అభివృద్ధికి కూడా దోహదం అవుతుందని తెలిపారు.



## గుమ్మడిదల మున్సిపాలిటీలో హీటెక్కిన రాజకీయ సమీకరణలు

**గత నాలుగు రోజులుగా సవాళ్లు ప్రతి సవాళ్లతో కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల మధ్య డి అంటే డి**

పటాన్ చెరు : బిఆర్ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి 13 వ వార్డు కౌన్సిలర్ నరేందర్ రెడ్డి ని రాజీనామా చేసి గెలువు అని విసిరిన సవాల్ ను స్వీకరించి రాజీనామా పత్రం ఇవ్వడానికి గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి వచ్చిన 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ నరేందర్ రెడ్డి,మద్దతుగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు. రాజీనామా సమర్పించడానికి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పంతం నెగ్గిన కౌన్సిలర్ నరేందర్ రెడ్డి. రాజీనామా ప్రతిసవాల్ కు మౌనం పాటించిన బీఆర్ఎస్ రాష్ట్రనేత చీమ్ముల గోవర్ధన్ రెడ్డి అనవసరమైన నోటిదూల మాటలతో ఇతరులను రెచ్చగొట్టి గొడవకు దారితీయడం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డిని హెచ్చరించిన కాంగ్రెస్ నాయకులు. పంతాలు పక్కనపెట్టి ఇద్దరు నేతలు కలిసిమెలిసి ఉండాలని ఇంతటితో గొడవకు శుభం కార్డు వెయ్యాలని కోరినా మున్సిపల్ చేర్మెన్ కుమార్ గౌడ్ ఇరువర్గాల మధ్య ఘర్షణలు కాకుండా చాకచక్యంగా వ్యవహరించి గొడవను సద్దుమనుగించిన పోలీసులు.



## దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ

**టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్**

హైదరాబాద్, ఏప్రిల్ 27: సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో దేశంలోనే తెలంగాణను ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలుపుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ లు సోమవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యా, వైద్యం పై దృష్టి సారిస్తూ మంచి పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందించాలని చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.

## వేసవి వినోదం.. విషాదాంతం



కాప్రా: వేసవి సెలవుల ఆటవిడుపు ఓ చిన్నారి ప్రాణాలను బలిగొంది. పుట్టినరోజు వేడుక జరుపుకొని 24 గంటలు గడవకుండానే మృత్యువు కబళించింది. ఈత నేర్చుకునేందుకు వెళ్లగా నిర్వాహకులు సరైన రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో నీట మునిగి మృతిచెందాడు. ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. కుషాయిగూడ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ బీఎన్‌రెడ్డికాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి బొడ్డు రాజు, మమత దంపతులకు కుమారుడు హృతిక్ (11), కుమార్తె జ్ఞానశ్రీ ఉన్నారు. హృతిక్ ఈసీఐఎల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఆరోతరగతి చదివేవాడు. చదువు, క్రీడల్లో చురుకుగా ఉండేవాడు. ఏప్రిల్ 26న పుట్టినరోజును ఇంట్లో సందడిగా జరిపారు. వేసవి సెలవులు కావడంతో ఆడుకునేందుకు తీసుకువెళ్లాలని మారాం చేస్తుండటంతో తండ్రి రాజు, మేనమామ రాజేందర్ సోమవారం బాలుడిని కుషాయిగూడలోని క్రీడా ప్రాంగణానికి తీసుకెళ్లారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈత నేర్చుకునేందుకు కొలనులోకి దిగాడు. రక్షణ జాకెట్లు ధరించకపోవడంలో మునిగిపోయాడు. వెంటనే తండ్రి, సిబ్బంది వెంటనే బాలుడిని రక్షించారు. 108 సిబ్బంది శ్రీనివాస్, వేణు సీపీఆర్ చేస్తూ ఈసీఐఎల్‌లో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు చనిపోయినట్లు నిర్ధారించారు.కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం రాత్రి క్రీడా ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు.

## ఒక్కసారి రక్తదానం -- ఒక ప్రాణానికి జీవదానం

**మీ కుటుంబం కూడా 'రక్తదాత' కుటుంబంగా గుర్తింపు"**
**జనసేన నాయకులు ప్రేమ్ కుమార్**



కూకట్‌పల్లి: ఏప్రిల్ 27(వాయిస్ టుడే): తలసీమియా రహిత తెలంగాణ లక్ష్యంగా చత్రపతి ధర్మ రక్షణ సేన ఆధ్వర్యంలో కేపీహెచ్బీ రోడ్ నెం.1లో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తలసీమియా బాధితులకు ఆపన్నహస్తం తలసీమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రతి నెలా లేదా రెండు నెలలకు ఒకసారి రక్త మార్పిడి తప్పనిసరి. అయితే వేసవికాలంలో రక్త కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో బాధితులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ "ప్రపంచంలో తయారు చేయలేని అమూల్యమైనది రక్తం మాత్రమే" "ఒక్కసారి రక్తదానం చేస్తే, మీరు ఒక ప్రాణాన్ని కాపాడినట్టే" "మీ కుటుంబం కూడా 'రక్తదాత కుటుంబం'గా గుర్తింపును పొందుతుంది" అని యువతను రక్తదానానికి ప్రోత్సహించారు. చత్రపతి ధర్మ రక్షణ సేన అధ్యక్షుడు కర్ర వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ శిబిరంలో మొత్తం 122 యూనిట్ల రక్తం సేకరించామని తెలిపారు. సహకరించిన ప్రతి రక్తదాతకు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేసిన స్వర్గీయ "కొమ్మిరెడ్డి దంపతులు" ఆదర్శప్రాయులు

హైదరాబాద్, ఏప్రిల్ 27: తెలంగాణ గౌరవ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ మాజీ శాసనసభ్యులు, సుప్రీంకోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు కొమ్మిరెడ్డి రాములు, శ్రీమతి కొమిరెడ్డి జ్యోతి దేవి ల జ్ఞాపకార్థం హైకోర్టు ఆవరణలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసారు . ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి మాట్లాడారు. న్యాయ కోవిదులు, 50 ఏళ్లకు పైగా తమ జీవితాన్ని న్యాయవాద వృత్తికి, ప్రజాసేవకు అంకితం చేసిన మెట్పల్లి మాజీ శాసనసభ్యులు, హైకోర్టు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కొమిరెడ్డి రాములు, జ్యోతక్కల సేవలు అజారామరమని కొనియాడారు. లౌకికవాదం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం వారు నిరంతరం శ్రమించారని అన్నారు. అటు ప్రజా సేవలో, ఇటు పలు కేసుల్లో వారి వాదనలు లౌకిక వాదాన్ని ప్రతిబింబించాయని కొనియాడారు. ఉపాధ్యక్షులు డివిల్ పాండు మాట్లాడుతూ.. నిబద్ధత గల అత్యుత్తమ న్యాయవాదుల్లో కొమిరెడ్డి రాములు, జ్యోతక్కలు ఒకరని, సామాన్య పౌరుల కోసం తమ జీవితాలను అంకితం చేశారని, రాజ్యాంగం, పౌర హక్కుల పవిత్రతను కాపాడే తమలాంటి



యువ న్యాయవాదులకు కొమిరెడ్డి రాములు, జ్యోతక్కలు ఆదర్శప్రాయు లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి తనయులు హైకోర్టు న్యాయవాదులు, టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, విజయ్ ఆజాద్ లతోపాటు సీనియర్ న్యాయవాది రఘునాథ్ గారు, మాజీ ప్రెసిడెంట్ జగన్ గారు, సిరి న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ గారు మరియు బార్ అసోసియేషన్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, నిరంజన్ రెడ్డి, కాసుల వినోద్, తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 28 ఏప్రిల్ 2026



## కాంగ్రెస్ చేతుల్లోనే కార్మికుల భవిష్యత్ సురక్షితం

**– ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షుడు జి. సంజీవ రెడ్డి**

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27(వాయిస్ టుడే) భారత జాతీయ ఐ ఎన్ టి సి అధ్యక్షులు, ప్రపంచ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ జి. సంజీవ రెడ్డిని సోమవారం ఉదయం వారి నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశం మరియు తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి, కార్మిక సంఘాల ఉనికి, ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు, అలాగే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని "మూలిగే నక్కపై తాటి కాయ"లా మారిందని అభివర్ణించారు. కార్మికులకు రక్షణ, హక్కులు, సంక్షేమం కల్పించగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని వారు స్పష్టం చేశారు. కేంద్రం మరియు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని, దాని ద్వారా కార్మికులకు మంచి రోజులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా దేశంలో కాంగ్రెస్ పార్టీ పునరాగమనం కోసం నాయకులు ఐక్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. అనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ హయాంలోనే భారీ ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పడి దేశ పారిశ్రామికాభివృద్ధికి పునాది పడిందని గుర్తుచేశారు. బీహెచ్ ఇఎల్, ఐడిపీఎల్, ఐడిఎల్, బీడీఎల్ వంటి సంస్థలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. మొత్తానికి, కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైన సందేశం వెలువడింది.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



ఖమ్మం, ఏప్రిల్ 27 ( వాయిస్ టుడే): రఘునాథపాలెం మండలం రైతు వేదికలో రైతుల కోసం ఏర్పాటుచేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యక్రమము గూర్చి వారు మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు సంక్షేమం కోసం వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్తలు చేపట్టిన రైతుల పక్షాన ఉద్యమముగా అభివర్ణించారు... వ్యవసాయ రంగంలో రఘునాథపాలెం మండలం అగ్రగామిగా నిలవాలని ఆ విషయంలో కావలసిన సహాయ సహకారాలు రైతుల పక్షాన అందిస్తానని, ఇప్పటికే పైప్ లైన్ ద్వారా సాగర్ జలాలతో మండలంలోని అన్ని గ్రామాల్లో గల చెరువులను నింపుతున్నామని తెలియజేస్తున్నాను... రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో 100 కోట్లతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని తెలియజేసినారు... రైతులు అభివృద్ధి చెందే విధముగా ఎటువంటి నష్టం లేని పంటలను సాగు చేయాలని ఆ విధముగా సహాయం చేయడంలో నేనెప్పుడూ కృషి చేస్తానని తెలియజేసినారు... ఈ కార్యక్రమంలో వారితోపాటు ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర, గోపాల్ రెడ్డి , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, ఎర్రగర్ల హనుమంతరావు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు రఘురాం , వాంకుడోత్ దీపక్ నాయక్ , గాజుల కృష్ణారావు , శాస్త్రవేత్తలు అధికారులు నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ఇంధన కొరత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి : మాజీ ఎంపీ నామ



ఖమ్మం, ఏప్రిల్ 27( వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన కొరత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో జనరేటర్లకు, అంబులెన్సులకు సకాలంలో ఇంధనం అందక సేవలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలకు కూడా ఇంధనం అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని, హార్వెస్టర్లు, ట్రాక్టర్లు నిలిచిపోవడంతో పంట కోత పనులకు అంతరాయం కలుగుతున్నాయని చెప్పారు. లారీలకు కూడా డీజిల్ లేకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలింపులు నిలిచిపోయాయని, దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యం పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజువారీ పనులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు కూడా రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆటోలు, బస్సులు పరిమితంగా నడవడం వల్ల ప్రజల జీవన విధానం దెబ్బతింటోందన్నారు. చిన్న వ్యాపారులు, సరుకు రవాణాదారులు కూడా ఈ పరిస్థితులతో నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు, కార్మికులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పరిస్థితిని సమీక్షించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలును ఆయన డిమాండ్ చేశారు.

# అల్లాపూర్ భూమి అంశంపై ఎమ్మెల్యే ఆరోపణలు అబద్ధాలే: కాంగ్రెస్ ఘాటు ఖండన



కూకట్ పల్లి : ఏప్రిల్ 27(వాయిస్ టుడే): అల్లాపూర్ సర్వే నెంబర్ 18 ప్రాంతాన్ని హ్యాట్రిక్ శాసనసభ్యులు సందర్శించి యథావిధిగా కాంగ్రెస్ పార్టీపై నిరాధార ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాము. అల్లాపూర్ సర్వే నెంబర్ 18లో 4 ఎకరాల 17 గుంటల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో గత 10 సంవత్సరాలుగా మదర్సా నిర్మిస్తామని చెబుతూ మా హ్యాట్రిక్ గారు రెండు సార్లు శాసనసభ ఎన్నికలలో, అలాగే రెండు సార్లు కార్పొరేటర్ ఎన్నికలలో ఓట్లు పొందిన విషయాన్ని చెప్పటానికి మేము ఏమాత్రం సంకోచించము.

4 ఎకరాల 17 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి 2 ఎకరాల విస్తరణకు రావడానికి కారణం ఎవరు? మీ స్థానిక నాయకుడే కదా? ఆ భూమిని ప్లాట్లుగా చేసి పేదవారికి అమ్మి నిర్మాణాలు చేయించిన వారు ఎవరు? ఈ విషయంపై హైడ్రా, రెవిన్యూ లేదా పోలీస్ శాఖలతో ఎవరితో విచారణ జరిపించాలన్నది మీరే నిర్ణయించండి. మేము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాము.

పేద ప్రజలు తెలియక మీ నాయకుల వద్ద భూములు కొనుగోలు చేసి నిర్మాణాలు చేసినట్లయితే, తరువాత ఆ నిర్మాణాలు తొలగించబడితే వారి బాధకు మీరు మరియు మీ నాయకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

హైడ్రా అధికారులపై మీకు ఎందుకు అంత ఆక్రోశమో తెలియదు గాని, ప్రజల చేత ప్రశంసలు పొందుతున్న అధికారులపై ఎప్పుడూ బురద చల్లడం మానుకోవాలి. మీ ఆలోచన విధానాన్ని మార్చుకోండి. అవసరమైతే మానసిక ఒత్తిడి తగ్గించుకునే మార్గాలను అన్వేషించండి.

ఇకపోతే, యథావిధిగా మీరు బట్టకాల్చి మీద వేసినట్లుగా ఈ అంశానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఉందని, 400 కోట్ల రూపాయల విలువైన భూమిని మా పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ విషయంలో కూడా మీకే అవకాశం ఇస్తున్నాము --- మా నాయకులు ఎవరో పేర్లు వెల్లడిస్తే, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటమే కాకుండా, మీకు మరియు ప్రజలకు క్షమాపణలు చెప్పించే బాధ్యత కూడా మేమే తీసుకుంటాము.

రెవిన్యూ శాఖ మరియు పోలీస్ శాఖ అధికారులు ఇప్పటికే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నాము. ఎప్పటికప్పుడు అధికారులపై, కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం మానుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి. అప్పుడే మీ "హ్యాట్రిక్" పేరు సార్థకం అవుతుంది. మేము చేసే ఏ ఛాలెంజ్ అయినా ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నాము. మాకు రాజకీయ లాభం కంటే ప్రజల మేలే ముఖ్యము. కూకట్‌పల్లి అభివృద్ధే మా ధ్యేయం.

## పాలేరు... అరెంపుల క్లస్టర్లలో 'ప్రజా దర్బార్'

ఖమ్మం, ఏప్రిల్ 26 ( వాయిస్ టుడే ): ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేరాలనే సంకల్పంతో, పాలేరు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సరికొత్త బాటలు వేస్తున్నారు. సామాన్యులు తమ చిన్నపాటి అవసరాల కోసం కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగకూడదన్న ధ్యేయంతో చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం రేపు (మంగళవారం) రెండు ప్రధాన కేంద్రాల్లో జరగనుంది. కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లోని 25 గ్రామాలకు చెందిన ప్రజల కోసం అధికారులు క్షేత్రస్థాయికి రానున్నారు.

మంగళవారం ఉదయం 8:00 గంటలకు కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ ప్రారంభం కానుంది. ఈ కేంద్రానికి పాలేరు, నాయకన్ గూడెం, భగవత్వీడు తండా, మంగళ్ తండా, కొత్తూరు, నర్సింహులగూడెం, సంధ్యా తండా, లాల్ సింగ్ తండా, గైగోల్లపల్లి, బోడియా తండా, చౌటపల్లి, ఎర్రగడ్డ తండా, గురవాయిగూడెం సహా 13 గ్రామ పంచాయతీల ప్రజలు హాజరుకావచ్చు. మధ్యాహ్నం 3:30 గంటల నుండి ఖమ్మం రూరల్ మండలం అరెంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మరో దర్బార్ నిర్వహించనున్నారు. ఈ కేంద్రానికి అరెంపుల, చింతపల్లి, కొండాపురం, అరేకోడు, అరేకోడు తండా, పొన్నేకల్, తల్లంపాడు, ఎం. వెంకటాయపాలెం, కస్నాతండా, కాచిరాజుగూడెం, తనగంపాడు, గూడూరుపాడు మొత్తం 12 గ్రామాల ప్రజలు తరలిరానున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్ సహా అన్ని శాఖల అధికారులు ఈ వేదికలపై అందుబాటులో ఉంటారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. "ప్రతి విన్నపాన్ని నేరుగా పర్యవేక్షిస్తాం.. ప్రజలకు జవాబుదారీగా ఉంటాం" అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టి.ఎస్.



ఖమ్మం, ఏప్రిల్ 27 ( వాయిస్ టుడే ): ఖమ్మం జిల్లా కలెక్టర్ గా దివాకర టి.ఎస్. సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న దివాకర టి.ఎస్. ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ను అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.



## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దినకర

ఖమ్మం, ఏప్రిల్ 27 ( వాయిస్ టుడే): ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కొణిజెర్ల గ్రామానికి చెందిన సిహెచ్. రామ లక్ష్మణులు దరఖాస్తు సమర్పిస్తూ, అధికారిక దుర్వినియోగానికి పాల్పడుతున్న కొణిజెర్ల గ్రామ పంచాయతీ పాలక వర్గంపై చర్యలు తీసుకోవాలని కోరగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏన్కూరు గ్రామ ప్రజలు గ్రామం పరిధిలో గల చెరువు క్రింద వరి పొలాలు కలిగిన రైతులు వర్షం వచ్చినప్పుడు చెరువు నిండి పొలాల్లో 4 అడుగుల వరకు నీరు నిలిచి వరి పంట నష్టపోతున్నా మని, ఏన్కూరు నుండి గార్ల ఒడ్డు వరకు కొత్తగా పోసే రోడ్డుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న దగ్గర మోరీలు కట్టాలని, రోడ్డు ప్రక్కన కాలువ తీయాలని, కాల్వ వెడల్పు చేయటం కొరకు దరఖాస్తు చేసుకోగా డిపిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మత్స్య శాఖ సొసైటీ అధ్యక్షులు రెడ్డి బోయిన వెంకన్న గ్రామంలో ఉన్నటు వంటి ఊరు చెరువు, చీకటి చెరువులు భూ కబ్జాకు గురవుతున్న విషయం గురించి ఫిర్యాదు చేస్తూ వీటిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మధిరలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి పిహెచ్సి సబ్ సెంటర్ ను కొత్త బిల్డింగ్ నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాత భవనానికి షిఫ్ట్ చేయడం గురించి దరఖాస్తు చేసుకోగా డీఎంహెచ్ఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంను సుందర నగరంగా తీర్చిదిద్దాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ఖమ్మం, ఏప్రిల్ 27.( వాయిస్ టుడే ): సౌకర్యవంతమైన రోడ్లులు, ప్రజలకు మెరుగైన జీవన వసతులతో పరిశుభ్రమైన నగరంగా ఖమ్మం ఆదర్శంగా నిలిచే విధంగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగర కార్పొరేషన్ 16వ డివిజన్ ద్వసంలాపురం లో ఒక కోటి 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన సిసిరోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి ఖమ్మం నగరాన్ని విస్తృత రహదారులు, సరిపడా తాగునీటి సరఫరా, 24 గంటల నిరంతర విద్యుత్ తో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు ఖమ్మాన్ని ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తానని, పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ అవసరమైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖమ్మంకు పలు నేషనల్ హైవేలు అదుబాటులోకి వచ్చాయని, రింగ్ రోడ్ ఏర్పాటు కానుందని, నగరానికి ట్రాఫిక్ సమస్యలు త్వరలో పరిష్కార మవుతాయని పేర్కొన్నారు.

నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టి ఖమ్మంను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఖమ్మం నగరాన్ని నాలుగు వైపులా సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి డివిజన్‌కు నిధులు కేటాయిస్తూ సమాన అభివృద్ధిని సాధిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రజల అభ్యర్థన మేరకు అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నారని వారి అమలు అధికారులుగా వేగవంతం చేస్తామని అన్నారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రులు ఎవరినీ నొప్పించకుండా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

యూజీడీ పనులు, అధునికంగా వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు కూడా వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ఖమ్మం నగరం ఆదర్శ నగరంగా మారుతుందని, మంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకత్వం లో నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ పనులు, అన్ని డివిజన్లలో రోడ్డు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆనతరం ద్వసంలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి నేషనల్ హైవే పై మున్నేరు రైల్వే బ్రిడ్జ వద్ద వంతన, ఖమ్మం కు ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాయింట్ పనులను కలెక్టర్ దివాకర్ టి.ఎస్ తో కలిసి మంత్రి తుమ్మల పరిశీలించారు. పనులు వేగ వంతంగా చేపట్టి రహదారులకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డివిజన్ కార్పోరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సిగ్నల్ కష్టాలకు చెక్..

## ఎంపీ రఘురాం రెడ్డి సరికొత్త లక్ష్యం



ఖమ్మం ఏప్రిల్ 27 (వాయిస్ టుడే ): ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న మొబైల్ నెట్‌వర్క్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఖమ్మం ఎంపీ, కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సభ్యులైన రామసహాయం రఘురాం రెడ్డి నడుం బిగించారు. 'డిజిటల్ ఇండియా'లో భాగంగా ప్రతి పల్లెకు హై-స్పీడ్ ఇంటర్నెట్ చేరాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా 25 కొత్త బీఎస్ఎన్ఎల్ (4+/5+) టవర్లను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర టెలికాం కార్యదర్శి అమిత్ అగర్వాల్ ను సోమవారం ఢిల్లీ లో కలిసి విన్నవించారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల పూర్తి వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి అందజేశారు.

### మారుమూల పల్లెల్లో కమ్యూనికేషన్ కరువు

నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాలు, ఎల్‌డబ్ల్యూఈ (మావోయిస్టు ప్రభావిత) ప్రాంతాలు మరియు సరిహద్దు గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ప్రభుత్వ సేవలు పొందే సామాన్యులకు ఈ నెట్‌వర్క్ సమస్య పెద్ద అడ్డంకిగా మారిందని వివరించారు. ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### 25 గ్రామాల్లో కొత్త టవర్ల కోసం ప్రతిపాదన

నియోజకవర్గ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంతో పాటు సరిహద్దు జిల్లా అయిన మహబూబాబాద్ ను కలిపుకొని మొత్తం 25 సమస్యాత్మక ప్రాంతాల జాబితాను ఎంపీ అందజేశారు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** అశ్వారావుపేట మండలంలోని కొత్త కన్నాయిగూడెం, కాంట్లం, చెన్నపురం, పాల్వంచ మండలంలోని మందారికాలపాడు, కారేగట్టు, సారెకల్లు, మొండికట్ట, రెడ్డిగూడెం, ములకలపల్లి మండలంలోని పాత గుండాలపాడు, గండిప్రోలు గ్రామాల్లో టవర్లు అవసరమని పేర్కొన్నారు.

**ఖమ్మం జిల్లా:** ఖమ్మం రూరల్ (కస్నా తండా), మధిర (నిధానపురం), ముదిగొండ (పమ్మి), కల్లూరు (వెన్నవల్లి), బోనకల్ (గోవిందాపురం ఎల్), ఎన్కూర్ (జన్నారం), వైరా (రెబ్బవరం), చింతకాని (నేరడ), రఘునాథపాలెం (పంగిడి), పెనుబల్లి (టేకులపల్లి) ప్రాంతాలను ప్రతిపాదించారు.

**మహబూబాబాద్ జిల్లా:** బయ్యారం మండలంలోని మిర్యాలపెంట, కొయ్యగూడెం, తిమ్మపురం, వెంకటాపురం, జగత్రావుపేట గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ ప్రాంతాల్లో 4జీ, 5జీ సేవలు అందుబాటులోకి వస్తే గిరిజన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడతాయని ఎంపీ రఘురాం రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన టెలికాం కార్యదర్శి... రాష్ట్ర టెలికాం అడిషనల్ డీజీతో మాట్లాడి ఎంపీ సూచించిన 25 టవర్ల ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



## ముదిగొండలో ఘనంగా బి.ఆర్.ఎస్ ఆవిర్భావ దినోత్సవం

### – కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షం: గ్రామ అధ్యక్షులు తేరాల రామారావు గౌడ్, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షులు షేక్ ఖాజా

### కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలు గమనిస్తున్నారు: మాజీ సర్పంచ్ మందరపు లక్ష్మీ వెంకన్న

ముదిగొండ మండలం ఏప్రిల్ 27 వాయిస్ టుడే:: ముదిగొండ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బి.ఆర్.ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముదిగొండ ప్రధాన కూడలి వద్ద పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తేరాల రామారావు గౌడ్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2001 ఏప్రిల్ 27వ తేదీన ముషీరాబాద్ కేంద్రంగా జలదృశ్యంలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోయిందని గుర్తు చేశారు. 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చారని కొనియాడారు.జిల్లా నాయకులు మరియు మాజీ సర్పంచ్ మందరపు లక్ష్మీ వెంకన్న, ఉద్యమ నాయకులు పొనుకుల కోటేష్ యాదవ్,ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షులు షేక్ ఖాజా మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మరియు అనేక హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. నేడు తెలంగాణ ప్రజలు కేసీఆర్ సమర్థవంతమైన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మళ్ళీ ఆయనకే పట్టం కట్టడం ఖాయమని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొమ్మూరి రమేష్, నాయిని వెంకన్న, మల్లారపు నరేష్, అంతోటి ఉదయ్ కుమార్, పటాన్ మస్తాన్, షేక్ అజీజ్, అక్రమ్, సైదాపాషా, నాగుల్ మీరా, డి చారి, దొనకొండ నాగరాజు మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

సిరిసిల్ల, ఏప్రిల్ 27, (వాయిస్ టుడే); ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సిరిసిల్ల, ఏప్రిల్ 27, (వాయిస్ టుడే); బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, తెలంగాణ భవన్ లో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుక లలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ జెండాను జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య చేతుల మీదుగా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ జెడ్పి చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు అకునూరి శంకరయ్య, బొల్లి రామ్మోహన్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనగణనకు ఖమ్మం జిల్లా సిద్ధం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ఖమ్మం, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూలి 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన తాను భూపాలపల్లి, జగిత్యాల, ములుగు జిల్లాల్లో పనిచేసి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. జిల్లాలో ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన వారికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2651 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 2669 మంది ఎన్యుమరేటర్లు, 485 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు. స్వీయ నమోదు కోసం ౦వ.ఎవఅంబం.ప్రశీజ.ఱఅ పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు.

జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు. ఈ రోజు ఉదయం ఉప ముఖ్యమంత్రి స్వీయ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. వేసవి చర్యల ప్రణాళిక అమలు గురించి మాట్లాడుతూ, జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం ప్రధాన ప్రాంతాల్లో తాగునీరు, ూ=ూ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, వేడి ప్రభావం తగ్గించేందుకు అవసరమైన సూచనలు ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యం, విద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఫీల్డ్ స్థాయి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఈ రోజు 110 లోడ్లు జిల్లాకు చేరాయని తెలిపారు. సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, లాజిస్టిక్ సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సీపీఓ, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయండి

### నందిపాటి మనోహర్ పిలుపు

ఖమ్మం, ఏప్రిల్ 27 ( వాయిస్ టుడే): కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాల జయప్రదం కోసం సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం న స్థానిక 57వ డివిజన్ లోనీ రమణగుట్ట ప్రాంతంలో విస్తృతంగా ఇంటి ఇంటికి కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతుల సందర్భంగా జన జాతర, కులరహిత సాంస్కృతిక జిల్లాస్థాయి ఉత్సవాలు ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదురుగా రమణ గుట్ట క్రింద ఓపెన్ గ్రౌండ్ లో 28 వ తేదీన మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభించడం జరుగుతుందనీ, ఈ ఆట పాట మాట కార్యక్రమంలో సామాజిక శక్తులు, ప్రజా సంఘాలు, అభ్యుదయ శక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు. కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు బోడపట్ల సుదర్శన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నకరికంటి చిరంజీవి, పాపిట్ల సత్యనారాయణ, కర్లకుంట నరేష్, గోపి సత్యం, గుమ్మడి బిక్షం, మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.



## అక్రిడేషన్ కార్డుల ధరఖాస్తుకు గడువును పొడిగించండి

### ఖమ్మం కలెక్టర్ కు డబ్ల్యూజేఐ వినతి

ఖమ్మం, ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): మొదటి విడత అక్రిడేషన్ కార్డుల ధరఖాస్తుకు విధించిన గడువును పొడిగించాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్ టి.ఎస్ దివాకరను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసిన యూనియన్ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో-కన్వీనర్ ఎం.ఏ అన్సార్ పాషా, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు బొడ్డుపల్లి రవీందర్ తదితరులు ఈ మేరకు ఒక వినతి పత్రం అందజేశారు. ఈ నెల 25లోగా అందిన ధరఖాస్తులనే మొదటి విడత జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో పరిశీలిస్తామని ఖమ్మం డీపీయార్వో కార్యాలయం ప్రకటించిందని తెలిపారు. ఈ ప్రకటన 24వ తేదీ సాయంత్రం గడువుకు 24 గంటల ముందు చేశారని, చాలా మంది జర్నలిస్టులకు మీడియా యాజమాన్యాల నుండి ఇంత వరకు ఒరిజనల్ లెటర్స్ అంద లేదని పేర్కొన్నారు. వాటిని హైదారాబాద్ వెళ్ళి తెచ్చుకొనే సమయం కూడా లేక పలువురు జర్నలిస్టులు తమ దరఖాస్తులను ఇన్ టైంలో ఇవ్వ లేక పోయారని వివరించారు. జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని మొదటి విడత అక్రిడేషన్ కార్డుల ధరఖాస్తుకు విధించిన గడువును కనీసం వారం రోజులకు తగ్గకుండా పొడిగించాలని ఈ సందర్భంగా కలెక్టర్ దివాకరను యూనియన్ ప్రతినిధులు కోరారు. అనంతరం కలెక్టర్ కు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ముద్రించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని అందజేశారు.



## ముదిగొండ బిడ్డ, డాక్టర్ జననికి అభినందనల వెల్లువ

### అసెంబ్లీ స్పీకర్ చేతుల మీదుగా పట్టా స్వీకరణ

ముదిగొండ మండలం ఏప్రిల్ 27 వాయిస్ టుడే: ముదిగొండ మండలానికి చెందిన సామినేని నాగేశ్వరరావు కుమార్తె జనని వైద్య విద్యలో అత్యున్నత ప్రతిభ కనబరిచి తన పోస్ట్ గ్రాడ్యుయేషన్ (PG) పూర్తి చేశారు. వికారాబాద్‌లోని ప్రముఖ వైద్య కళాశాలలో విద్యనభ్యసించిన ఆమె, ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా తన పట్టాను అందుకున్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన జనని, పట్టుదలతో చదివి వైద్య రంగంలో ఈ స్థాయికి చేరుకోవడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. స్పీకర్ చేతుల మీదుగా పట్టా అందుకోవడం ఆమె కృషికి దక్కిన గౌరవంగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

### కుటుంబ సభ్యుల సంతోషం..

జనని సాధించిన ఈ గొప్ప విజయంపై ఆమె తండ్రి సామినేని నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రముఖులు, మిత్రులు ఆమెకు సామాజిక మాధ్యమాల వేదికగా మరియు ప్రత్యక్షంగా అభినందనలు తెలియజేస్తున్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 28 ఏప్రిల్ 2026



## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ, ఏప్రిల్ 27, (వాయిస్ టుడే); వేములవాడ పట్టణం లోని 10 వార్డు,16 వార్డు రూరల్ మండలం పోచెట్టి పల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని ఆయన అన్నారు.

## ఇంటిపన్నులో 5%రిబేట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**



జమ్మికుంట ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): ఇంటి పన్ను వసూళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 5% రిబేట్ ఏర్పాటు చేయగా మున్సిపల్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పన్ను వసూళ్లలో 5% రిబేట్ ఏర్పాటు చేయగా, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, వ్యాపార వాణిజ్య వర్గాలు, ప్రజల సహాయ సహకారాలతో ఇప్పటి వరకు జమ్మికుంట మున్సిపాలిటీలో కోటి 42లక్షల రూపాయలు చెల్లించారని, రిబేట్ 5% సద్వినియోగం చేసుకొని వారు ఈ నెల చివరి వరకు ఇంటి పన్ను చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్.ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణీ, వార్డ్ ఆఫీసర్స్ లతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్**



జమ్మికుంట ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర సాధకులు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్రం సాధించుకొనట కోసం ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జమ్మికుంట పట్టణ పరిధిలోని 23 మరియు 12 వార్డులలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఆనాడు కేసీఆర్ ఏర్పాటు చేసిన ఈ భారత రాష్ట్ర సమితి వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగింది అని తెలుపుతూ జమ్మికుంట పట్టణ ప్రజలకు భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచూ రమాదేవి, వార్డు అధ్యక్షులు పసునూటి శ్రీకాంత్,నాగపురి శ్రీనివాస్,ఉడుత రమేష్, అమీర్, దేవరాజు నదీమ్, జాఫర్, నజీర్, ఖాజా, శివ తదితరులు పాల్గొన్నారు.



## కపిల్ బాల కుటీర్ ఆశ్రమంలో విద్యార్థులకు కరాటే పోటీలు

కరీంనగర్,ఏప్రిల్ 27(వాయిస్ టుడే): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్ గాయత్రి నగర్ లో ఉన్న కపిల్ బాల కుటీర్ ఆశ్రమంలో విద్యార్థుల కోసం కరాటే పోటీలు నిర్వహించారు.ఈ కరాటే పోటీ పరీక్షలలో సుమారు 52 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కరాటే లోని వివిద స్థాయి బెల్టులు సాధించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సీనియర్ వైద్యులు డా.రఘురామన్, శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు రణధీర్,కపిల్ బాల కుటీర్ చైర్మెన్, ట్రస్టీ బల్మూరి కర్ణాకర్ రావు,వైస్ ప్రెసిడెంట్ రాజా రెడ్డి మరియు ఒకినావా కరాటే సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కే.వసంత్ కుమార్ పాల్గొని ఈ కార్యక్రమంలో పాల్గొని పోటీ పరీక్షలో ఉత్తీర్ణులైన బాల బాలికలకు కరాటే బెల్ట్,సర్టిఫికెట్స్ లను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు.కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు వ్యక్తిగత వికాసం,మానసిక పరిపూర్ణత సిద్ధిస్తాయన్నారు. కరాటే కేవలం పోరాటం కాదని,ఆయుధాలు లేకుండా కేవలం శరీర బలంతో ఆత్మ రక్షణ చేసుకోవడం,శారీరక దృఢత్వం,క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం, మానసిక ఏకాగ్రతను పెంచే ఒక అద్భుతమైన విద్యా అని వారు ఈ సందర్భంగా చెప్పారు.

# చిగురుమామిడి మండలంలో గులాబీ జోష్

**ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాగ్రామాన గులాబీ జెండాల ఆవిష్కరణ**

**నాయకుల ఉత్సాహభరిత సందేశాలు**



చిగురుమామిడి, ఏప్రిల్ 27 (వాయిస్ ఆఫ్ ప్రజలు): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలవ్యాప్తంగా సోమవారం గులాబీ పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని గులాబీ జెండాలను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. గ్రామాగ్రామాన పార్టీ కార్యకర్తల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. మండలంలోని బొమ్మనపల్లి, ఓగులాపూర్, నవాబ్‌పేట్, రేకొండ, ముల్కనూరు, ముదిమాణిక్యం, రామంచ, ఇందుర్తి తదితర గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని, ఉద్యమ కాలంలో ఎదురైన సమస్యలను అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పరిష్కరించి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందని పేర్కొన్నారు. "అభివృద్ధి – – సంక్షేమం" అనే ద్వంద్వ లక్ష్యాలతో బీఆర్ఎస్ దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ గళమెత్తి పోరాడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతూ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వానికి బీఆర్ఎస్ దిక్సూచి అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మొత్తంగా చిగురుమామిడి మండలంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా, ఐక్యతను ప్రతిబింబించేలా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, మండల నాయకులు పెనుకుల తిరుపతి, బెజ్జంకి రాంబాబు, ఎండి సర్వర్ పాషా, బెజ్జంకి లక్ష్మణ్, బోయిని శ్రీనివాస్, సర్పంచ్ భవాని, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, అలాగే పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

**బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్**

కరీంనగర్,ఏప్రిల్ 27(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వం 8 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారనీ,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కువినతి పత్రం ఇచ్చిన అనంతరం మీడియాతో కరీంనగర్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్,బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ఈ రేవంత్ సర్కార్ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఇప్పటి వరకు విద్యా శాఖ మంత్రి లేకపోవడం విద్యా వ్యవస్థలో ఎలాంటి రివ్యూలు నిర్వహించడం లేదని అసలు తెలంగాణ విద్యార్థులు ఈ ప్రభుత్వాన్ని ఒక శాపంగా భావిస్తున్నారని అన్నారు.ఫీజు రీయంబర్స్ మెంట్ లపై వినతి పత్రంతో ప్రారంభమైన బిఆర్ఎస్వి ఉద్యమం రాష్ట్రంలో విద్యార్థుల ఫేస్ బకాయిలు పూర్తి స్థాయిలో విడుదల అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు.రాష్ట్ర పార్టీ ఆదేశం మేరకు రాబోవు రోజుల్లో సీఎం ఇల్లు ముట్టడి చేయబోతున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్వి శాతవాహనయూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ ,నగర అధ్యక్షుడు బొంకురి మోహన్, ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యక్షుడు నాయిని అన్వేష్, సీనియర్ నాయకులు అరె రవి గౌడ్,గంగాధర చందు,వడ్లకొండ పరుశరాములు, శ్రీకాంత్,విక్రమ్, ఓంకార్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ అవిర్భావ వేడుకలు

**తెలంగాణ రాష్ట్ర ప్రజల పార్టీ బిఆర్ఎస్ పార్టీ**

**బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్**



కరీంనగర్, ఏప్రిల్ 27(వాయిస్ టుడే): భారత రాష్ట్రసమితి పార్టీ 25 ఏళ్లు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పార్టీ పిలుపుమేరకు నేడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చింత కుంటలోని పార్టీ జిల్లా కేంద్రంలో బారాస నాయకులతో కలసి గులాబీ జెండాను ఆవిష్కరణ చేసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఒక పార్టీ ఉండాలని తలంచి టిఆర్ఎస్ పార్టీ నీ స్థాపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి సాధించిన రాష్ట్రానికి తొలి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని పదేళ్ల పాటు అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉంచిన కెసిఆర్ ను మళ్ళీ ప్రజలు ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటారని వారు పేర్కొన్నారు. బిఆర్ ఎస్ పార్టీనీ తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి పక్షంగా ఉండి ప్రజలకోసం ఉద్యమిస్తూ వారికి అన్నివిథాలుగా అండగా ఉంటున్న ఏకైక పార్టీ బిఆర్ ఎస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ తో పాటు, కార్పొరేటర్లు గుగ్గిళ్ళ జయశ్రీ, నలువాల పుష్పలత-రవీందర్,అలీ, గడ్డి ప్రదీప్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్,పార్టీ నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నగరమైనార్టీ విభాగం అధ్యక్షుడు మీర్ సౌకత్ అలీ,బిఆర్ఎస్వి నగర ఆధ్యక్షులు బొంకూరి మోహన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు డివిజన్ ఇన్చార్జులు బారాస నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజల ఆరోగ్యమే మాకు ముఖ్యం : వొడితల ప్రణవ్

**- ప్రజల్లో ఉనికి కాపాడుకోవడానికి కౌశిక్ రెడ్డి కొత్త నాటకాలు..**

**- గత ప్రభుత్వం ఇచ్చింది అన్న బండి సంజయ్ అప్పుడు ఎందుకు మాట్లాడలేదు..**

**- డంప్ యార్డ్‌కు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కి తేడా తెలుసుకోండి.డంప్ యార్డ్ హుజురాబాద్ లో పెడతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదు**

**- బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగిన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్**

హుజురాబాద్ ఏప్రిల్ 27 (వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానమని,రాజకీయం కోసం బిఆర్ఎస్,బీజేపీ పార్టీలు చేస్తున్న కుటిల రాజకీయం ప్రజల్లోకి తీసుకెళ్తామని,డంప్ యార్డ్ పెడతామని ఎక్కడా చెప్పలేదని,వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్,డంప్ యార్డ్కు తేడా తెలుసుకోవాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సూచించారు. సోమవారం నాడు హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ లో నియోజకవర్గ పరిధిలోనీ 5 మండలాలు రెండు పట్టణాలకు కలిపి 58,44,500/- విలువ చేసే 181 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కష్ట కాలంలో మాకు అండగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ డంప్ యార్డ్ గురించి,వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారని,అస్సలు ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం ఎలాంటి ముందుకు వెళ్లకున్న ఏదో జరుగుతుందని ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని, గత ప్రభుత్వం(బిఆర్ఎస్)లో ఈ ప్రతిపాదన వచ్చిందని,బీజేపీ పార్టీ ఎంపీ ఈటెల రాజేందర్,కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సజయ్ మాట్లాడారని అప్పుడు ఎమ్మెల్సీ గా ఉన్న కౌశిక్ రెడ్డి ఇది తెలిసి కూడా తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా చస్తా అని శవ రాజకీయాలు తప్ప ప్రజల బాగోగుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.

కేంద్ర మంత్రి బండి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన ప్రణవ్.

హుజురాబాద్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ గురించి మాట్లాడే ముందు కరీంనగర్ డంప్ యార్డ్ పై అక్కడి ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు ప్రణవ్..అక్కడి ప్రజలు డంప్ యార్డ్ మాకు వద్దు అని చెప్పినా ఎంపీగా,కేంద్ర మంత్రిగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇక్కడికొచ్చి స్పీచ్లు ఇవ్వడం అతని విజ్ఞతకే వదిలేస్తున్నామని,కౌశిక్ రెడ్డి,బండి సంజయ్ వ్యాఖ్యలు ఒకేలాగా ఉన్నాయని ఇద్దరు దొందూదొందే అని అన్నారు..వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించేలా మంత్రులను సంబంధిత అధికారులను కలిశామని,దానికి అనుగుణంగా మున్సిపల్ పాలకపక్షం ప్లాంట్ వేరే చోటుకు మార్చాలని తీర్మానం చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీగా ప్రజలకు హాని చేసే పని చేయమని మరోసారి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని, హుజురాబాద్, జమ్మికుట కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, వార్డ్ సభ్యులు,దేవస్థాన చైర్మన్లు,మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాల్లు, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మైనారిటీ, యువజన,బ్లాక్ కాంగ్రెస్,సేవాదళ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**